నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి 1
మంగళవారం 02 మే 2023

గంగమ్మ తల్లి విగ్రహప్రతిష్టాపన

నవతెలంగాణ-నసురుల్లాబాద్

నసురుల్లాబాద్ మండల కేంద్రంలోని మిర్జాపూర్ గ్రామ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంను ఘనంగా నిర్వహించారు. సోమవారం రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ సోమవారం నుండి బుధవారం వరకు ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను, హోమం, ప్రత్యేక హారతి గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినట్టు వివరించారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డిని పూలమాల, శాలువాతో ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. స్పీకర్ మాట్లాడుతూ అన్ని మతాలను అన్ని సంప్రదాయాలను గౌరవిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కర్క శ్రీనివాస్ మారుతి పటేల్ పురం వెంకటరమణ గుండ్ల గంగాధర్ మజీద్ రాము కంది మల్లేష్ గంగపుత్ర సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాలీబాల్ శిక్షణను వినియోగించుకోవాలి

నవతెలంగాణ-గాంధారి


వాలీబాల్ శిబిరం ప్రారంభించిన సర్పంచ్

గాంధారి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరాన్ని గాంధారి సర్పంచ్ అమ్మాయి సంజీవ్ యాదవ్ ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాలీబాల్ శిక్షణ కేంద్రాన్ని మండలం లోని క్రీడాకారులు విద్యార్థినిలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర గౌడ్, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ స్వామి, సిఆర్పి రాజు, నాయకులు శీను నాయక్, పాఠశాల సిబ్బంది క్రీడాకారులు పాల్గొన్నారు.

వాడవాడలా ఎర్రజెండా రెపరెపలు

- వీరుల త్యాగాల స్మరణ
- హక్కులకు ఉద్యమిద్దామని శపథం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఘనంగా మేడే వేడుకలు
- సీపీఐ(ఎం), సీఐటీయూ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ
- సీపీఐ, సీపీఐ ప్రజాపంథా ఆధ్వర్యంలో ప్రదర్శనలు
- మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం : ఎస్వీ రమ

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

'మేడే స్ఫూర్తితో కార్మిక హక్కులకు ఉద్యమిస్తాం' '8 గంటల పని విధానం కాపాడుకుంటాం' 'లేబర్ కోడ్‌లు వెంటనే ఉపసంహరించుకోవాలి' 'చికాగో అమరవీరుల ఆశయాలు సాధిస్తాం' 'కేంద్ర సర్కారు కార్మిక వ్యతిరేక విధానాలు నశించాలి' 'కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి' అంటూ ఉమ్మడి జిల్లావ్యాప్తంగా కార్మికులు నినదించారు. కేంద్రంలోని మోడీ సర్కారు కార్పొరేట్ యజమానులకు తొత్తులుగా మారి కార్మికుల హక్కులు కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చికాగో అమరవీరుల త్యాగాల స్ఫూర్తితో ఎనిమిది గంటల పని విధానం కోసం, కార్మిక చట్టాల కోసం ఐక్యంగా సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పరిశ్రమల్లో, ఖార్ఖానాల్లో, ఆటో అడ్డాలలో, పారిశ్రామిక వాడల్లో, ప్రధాన కూడళ్లలో ఎర్రజెండా రెపరెపలాడింది. ఇక నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రంలో సీఐటీయూ ఆధ్వర్యంలో వారోత్సవాలు ప్రారంభమవగా.. ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ నేతృత్వంలో ప్రదర్శనలు, ర్యాలీలు నిర్వహించారు.

మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వీ రమ

మేడే స్ఫూర్తితో మోడీ సర్కారు కార్మిక వ్యతిరేక విధానాలు ప్రతిఘటిద్దామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఎస్వీ రమ కార్మికులకు పిలుపునిచ్చారు. సోమవారం సంఘ కార్యాలయం వద్ద ఆమె జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మోడీ పాలనలో గత 8 యేండ్లుగా స్వదేశీ, విదేశీ పారిశ్రామికవేత్తల ఆర్థిక ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లేబర్ కోడ్లను తెచ్చారన్నారు. 8 గంటల పని దినాన్ని 12 గంటలకు పొడిగించేందుకు, కార్మికులపై పని భారం పెంచేందుకు శ్రీకారం చుట్టారన్నారు. యూనియన్లు పెట్టుకునే హక్కును నిరాకరిస్తున్నారని వాపోయారు.. కనీస వేతనాలు, సమాన పనికి సమాన వేతనాలివ్వాలన్న చట్టబద్ధ ఆదేశాలను, న్యాయస్థానాల తీర్పులను బుట్టదాఖలు చేస్తున్నారని వివరించారు. కార్మిక సంక్షేమం, సాంఘిక భద్రత, ఉపాధి, ఉద్యోగ రక్షణ లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పారిశ్రామిక రంగంలో పెట్టుబడిదారుని వాటా 15.7శాతం నుండి 53.8 శాతానికి పెరిగితే... వేతనాల్లో కార్మికుడి వాటా 51.5శాతం నుండి 14.8 శాతానికి పడిపోయిందని వివరించారు. దేశంలో నయా ఉదారవాద విధానాలు, సంస్కరణల అమలు వల్ల ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని అన్నారు. కార్మికవర్గంతో పాటు రైతు-వ్యవసాయ కార్మికులు, సామాన్య ప్రజలు సైతం దోపిడీకి గురవుతున్నారని వివరించారు. పాలకవర్గాలు కులం, మతం, ప్రాంతం, లింగం, జాతి, భాష తదితర భావోద్వేగాలను ఉపయోగించుకుంటూ కార్మిక వర్గ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ ఆర్థిక ప్రయోజనాలతో పాటు రాజకీయ ప్రయోజనం పొందుతున్నాయని, ఈ విషయంలో కార్మికులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ మేడే స్ఫూర్తితో కేంద్రంలోని మోడీ సర్కారు అవలంబిస్తున్న కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. మేడే అమరవీరుల స్ఫూర్తితో జిల్లాలో కార్మికులు పోరాటాలను తీవ్రతరం చేయాలని కోరారు. గ్రామీణ ప్రాంతంలో రైతు, వ్యవసాయ కూలీలు, సామాన్య ప్రజలను కలుపుకుని ఐక్య పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. మే 1 నుండి 7 వరకు జరిగే వారోత్సవాలను విజయవంతం చేయాలని, మేడే స్ఫూర్తితో ఐక్య పోరాటాలకు అంకితం కావాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ మాజీ జిల్లా అధ్యక్షులు రామ్మోహన్‌రావు, జిల్లా ఉపాధ్యక్షులు గోవర్ధన్, ఈవీఎల్ నారాయణ, శ్రీనివాస రాజ్, సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కృష్ణ, రాములు, ఆశ యూనియన్ నాయకులు రేణుక సుకన్యతో పాటు నాయకులు జాన్, ఫారుక్, గంగామణి, జరీనా, వాణి, జరీనా, సునీత, తనీష్, అబ్దుల్, రాములు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.


నిజామాబాద్‌లోని సీఐటీయూ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు రమ..


కామారెడ్డిలో మున్సిపల్ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరించిన సీఐటీయూ నాయకులు

మే డే స్ఫూర్తితో బీజేపీ మతోన్మాద విధానాలపై పోరాటానికి సిద్ధం కావాలి

కామారెడ్డిలోని మున్సిపల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మున్సిపాలిటీ కార్యాలయం ఎదురుగా మేడే జెండాను సీఐటీయూ జిల్లా కన్వీనర్ కే చంద్రశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడే జెండా పండుగను ప్రపంచవ్యాప్తంగా కుల మతాలకు అతీతంగా హిందువు, ముస్లిం, క్రిస్టియన్స్ అని చూడకుండా కార్మికులు ఐక్యంగా ఉండి తమ హక్కుల జెండా ఎరుపు జెండా అని నినాదించి ఎగురవేసే జెండా అని, ఇది కార్మికుల హక్కులకై పోరాటంలో ముందుంటుందని తెలిపారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మిక హక్కులను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు. హక్కుల సాధన కోసం కార్మికులందరూ ఐక్యంగా ఉద్యమమించాలని పిలుపునిచ్చారు. అనంతరం కే రాజనర్సు మున్సిపల్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌డి మహబూబ్ అలీ మున్సిపల్ యూనియన్ పట్టణ అధ్యక్షులు, అంజయ్య, దీవెన, ప్రవీణ్, శివరాజవ్వ, నడిపి నరసవ్వ, జి లక్ష్మి, రాజవ్వ, నవీన్, మీసాల రవి, ప్రభాకర్, రవీందర్, హెల్డి సాయిలు, విజయ్, విజయ్ కోటి, శేఖర్, అలిన్ ఖాన్, భాను, మురళి, శానిటేషన్ వర్కర్స్, డ్రైవర్స్, జవాన్లు, సూపర్వైజర్లు, వాటర్ వార్ సిబ్బంది తదితరులు కార్మికులు పాల్గొన్నారు.


జెండా ఆవిష్కరిస్తున్న మెడికల్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ ప్రతినిధులు

ప్రైవేటీకరణ, మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలి

సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పిలుపు

నవతెలంగాణ-కంఠేశ్వర్


సీపీఐ(ఎం) కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న నాయకులు

మే డే స్ఫూర్తితో ప్రైవేటీకరణ మతోన్మాద విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్ బాబు పిలుపునిచ్చారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే సందర్భంగా జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరించి మాట్లాడారు. మే డే స్ఫూర్తిని చాటుతూ కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేయడం జరిగింది. అనంతరం రమేష్ బాబు మాట్లాడుతూ.. చికాగో అమరవీరుల పోరాట స్ఫూర్తితో మేడే దినోత్సవం ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తున్నప్పటికీ నేటి భారత పాలకులు పోరాడి సాధించిన హక్కులను కాలరాసే పద్ధతుల్లో చట్టాలను నీరు కారుస్తున్నారని, ప్రజా అవసరాల కోసం నిర్మించుకున్న ప్రభుత్వ రంగ సంస్థలను పెట్టుబడుదారులకు కార్పొరేట్ కంపెనీలకు కారు చౌకగా కట్టబెడుతూ ఉపాధిని హరిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ సావిత్రి కవి దానాలకు నిరసనగా పోరాటం చేసే ప్రజల మధ్య మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టి వైశ్యామ్యాలను పెంచి తమ రాజకీయ ప్రయోజనాల కోసం విద్వేషాలను పెంచి ప్రజా హక్కులను కాలరాస్తున్నారని అన్నారు. తమ హక్కుల కోసం కార్మిక కర్షకులు అందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షులు ఆనంద్ మేడే స్ఫూర్తిని చాటుతూ పాటలు పాటారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకట్రాములు, నూర్జహాన్, సబ్బని లత, గోవర్ధన్, జిల్లా కమిటీ సభ్యులు సుజాత, సిఐటియు నాయకులు బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈవీఎల్ నారాయణ, విగ్నేష్, నగర నాయకులు కృష్ణ, రాములు, అబ్దుల్, మునీర్ అహ్మద్, మహేష్, శివలింగం, అనిత, గీతాంజలి, ఆశీర్వాదం, కళావతి, తదితరులతో పాటు కార్య కర్తలు పాల్గొన్నారు. అనంతరం బహుజన కాలనీలో కాలనీ వాసులతో మేడే కార్యక్రమాలు నిర్వహించారు.

రైతుల మౌన రోదన

- ప్రతిరోజూ కురుస్తున్న వర్షంతో ముద్దవుతున్న ధాన్యం
- పలు చోట్ల మొలకెత్తుతున్న వడ్లు
- ఎండబెట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న రైతులు

నవతెలంగాణ-బోధన్/ఎడపల్లి


ధాన్యం సంచుల చుట్టూ చేరిన నీరు..


సాలూరలో ధాన్యం పశీలిస్తున్న తహసీల్దార్

పంట పండించిన రైతన్న అది చేతికి వచ్చేవరకు దానిని కంటికి రెప్పలా కాపాడుతాడు. ఎన్నో ఆశలతో పంట కోసి ఆరబెట్టి విక్రయించేందుకు సిద్ధమ వగా.. అకాల వర్షం వారి ఆశలపై నీళ్లు చల్లింది. వారం రోజులుగా ప్రతిరోజూ వర్షం కురుస్తుండటంతో ఆరబెడుతున్న పంట మళ్లీ తడిచి ముద్దవుతుంది. ప్రతిరోజూ కురు స్తున్న వర్షంతో ధాన్యానికి మొలకలు వస్తున్నాయి.

ప్రతిరోజు పొద్దంత ఎండ కాస్తుండగా సాయంత్ర వేళ వర్షం కురుస్తుంది. దీంతో ధాన్యం తడుస్తుండగా.. మళ్లీ ఆరబెట్టడం.. తడవడం పరిపాటిగా మారింది. ధాన్యం చుట్టూ చేరిన వర్షం నీటిని తొలగిస్తున్నా మళ్లీ నీరు వచ్చి చేరుతోంది. దాంతో రైతుల కన్నీరు పెట్టుకుంటున్నారు. బోధన్ ఉమ్మడి మండలంలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి వర్షం నీరు ధాన్యం బస్తాల చుట్టూ నిలిచిపోయింది. దాంతో ధాన్యం బస్తాలు రైస్ మిల్లులకు పంపడం ఇబ్బందిగా మారింది. కొంతమంది రైతుల ధాన్యం పూర్తిగా మొలకెత్తినా వాటిని ఆరబెడుతూ ఆశగా ఎదురుచూస్తున్నారు. తడిసిన ధాన్యం రైస్ మిల్లర్లకు పంపితే ఆరబెట్టుకుని తీసుకురావాలని చెప్తున్నారని, ధాన్యం ఆరబెట్టే అవకాశం లేక వర్షానికి మళ్లీ తడుస్తుందేమోనని రైస్ మిల్లర్లకు ఎంతో కొంతకు విక్రయి స్తున్నారు. రైతుల బలహీనతను, బాధను అవకాశంగా భావించిన రైస్ మిల్లర్లు క్వింటాల్‌కు తరుగు పేరిట దగా చేస్తున్నారు. ఒక్కో సంచికి రెండు నుంచి మూడు కిలోలు కడ్తా తీస్తున్నట్టు రైతులు వాపోతున్నారు.

తడిసిన ధాన్యం పరిశీలించిన తహశీల్దార్

సాలురా మండలంలో తడిసిన ధాన్యాన్ని సోమవారం తహసీల్దార్ మమత పరిశీలించారు. రైతులు ధాన్యం తడవకుండా మరిన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ధాన్యం కొనుగోలుకు ఎలాంటి ఇబ్బందులు లేవని, రైతులకు సంబంధించిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తామని, రైతులు ఆందోళన చెందవద్దని ఆమె భరోసా కల్పించారు. ఆమె వెంట ఏఈఓ అపర్ణ ఉన్నారు.

ఎడపల్లి : ఎడపల్లి మండలంలో కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిచి మొలకలు వస్తున్నాయి. వడ్డేపల్లి, మంగళ్‌పాడ్, తానాకలాన్, ఎడపల్లి క్యాంప్, జానకంపేట గ్రామ శివారులో అత్యధికంగా వారి ధాన్యం కుప్పలు ఉన్నాయి. ఎండ లేకపోవడం వలన రైతులు ధాన్యాన్ని ధాన్యం రాశులు కుప్పలు చేసి తాడిపత్రిలో కప్పి ఉంచారు. రోజులో ఒక గంట పాటు ఎండ కొడితే ధాన్యం ఆరబెడుతుండగా.. మళ్లీ సాయంత్రం వేళ వర్షం కురుస్తుండటంతో తడుస్తుంది. మంగళ్‌పాడ్ గ్రామానికి చెందిన మాణిక్యాల సత్య గౌడ్ తానాకలాన్ రెవెన్యూ శివారులో 15 ఎకరాల పంటను ఆరబెట్టగా.. వడ్లు తడిచి మొలకలు వస్తున్నాయి. అలాగే వడ్డేపల్లి గ్రామ రైతు ఎర్ర అబ్రహం కు చెందిన నాలుగు ఎకరాలలో ధాన్యం రాశులు పూర్తిగా తడిసిపోయి మొలకలు వచ్చాయి. ఇలా మండలం వ్యాప్తంగా అనేక మంది రైతుల ధాన్యం తడిచి ముద్దవుతూ మొలకలు వస్తున్నాయి. తడిచిన ధాన్యమూ కొనుగోలు చేయాలని అధికారులను రైతులు కోరుతున్నారు.


ఎడపల్లిలో మొలకెత్తిన ధాన్యం చూపుతున్న రైతు

రైతులు కష్టపడుతుంటే చూస్తూ ఉంటారా..?

- అధికారుల తీరుపై స్పీకర్ పోచారం ఆగ్రహం
- మిర్జాపూర్‌కు పరుగులు తీసిన జిల్లా అధికారులు

నవతెలంగాణ-నసురుల్లాబాద్


అధికారులతో మాట్లాడుతున్న స్పీకర్


అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్పీకర్

జిల్లాలో పని చేస్తున్న పలు శాఖల అధికారుల పనితీరు పై రాష్ట్ర శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకవైపు అకాల వర్షం మరోవైపు రైతులు కన్నీరు పెడుతుంటే కొందరు అధికారులు ఆఫీస్ లకే పరిమితం కావడం, మరికొందరు విధులకు ఎగనామం పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు కష్టపడుతూ ఉంటే చూస్తు ఉంటారా అని ప్రశ్నించారు. కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలం మిర్జాపూర్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు విచ్చేసిన సందర్భంగా స్పీకర్ పోచారం ఎదుట అకాల వర్షంతో నష్టపోయిన రైతుల గోడు వినిపించారు. ఎండిన ధాన్యమూ కొనుగోలు చేయడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేయగా స్పందించిన స్పీకర్ జిల్లా అధికారులకు ఫోన్ చేసి ఎండిన ధాన్యం ఎందుకు కాంటా పెట్టడం లేదని ప్రశ్నించారు. పౌరసరఫరా, మార్కెటింగ్ శాఖల అధికారులు సెలవులపై వెళ్లడంతో జాయింట్ కలెక్టర్‌కు ఫోన్ చేసి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఇబ్బంది పడుతుంటే అధికారులు సెలవులపై వెళ్లడం ఏమిటని ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖల అధికారులు సమయపాలన పాటించడం లేదని, ప్రజలకు రైతులకు అందుబాటులో ఉండటం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు తమ భార్య పిల్లలతో కలిసి కల్లాల వద్ద కన్నీరు పెడుతుంటే, స్పందించాల్సిన అధికారులు పెడచెవి పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. రెండు గంటల పాటు మిర్జాపూర్ లో ఉంటున్నానని మీరందరూ రావాలంటూ ఆదేశించారు. దీంతో కామా రెడ్డి జిల్లా కేంద్రం నుంచి జిల్లా ఉన్నత అధికారులు తరలివచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్, జిల్లా పౌరసరఫరాల శాఖ, వ్యవసాయశాఖ, అధికారులు, రెవెన్యూ అధికారులు ,ఇతర శాఖల అధికారులు తరలివచ్చారు. కింది స్థాయి అధికారుల నిర్లక్ష్యం, పనితీరును వివరించారు. ఏ ఒక్కరూ విధుల పట్ల నిర్లక్ష్యం చేయకూడదని స్పీకర్ ఆదేశించారు.

రైతు వేదికలు తెరవడం లేదు

మీర్జాపురం ఏఇఓను సస్పెండ్ చేయండి

విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన మిర్జాపూర్ వ్యవసాయ విస్తీర్ణ అధికారి భానుచందర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని బాన్సువాడ వ్యవసాయ అధికారి వినయ్ కుమార్‌కు పోచారం శ్రీనివాస్ రెడ్డి ఆదేశించారు. మిర్జాపూర్‌లో పనిచేస్తున్న భాను చందర్ గత కొంతకాలంగా విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ మృతి చెందిన రైతు కుటుంబానికి రైతుబంధు, బీమా పథకం రావడంలో నిర్లక్ష్యం చేయడం, స్పీకర్ కుటుంబ సభ్యుడిని అంటూ చెప్పుకోవడం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తనకు ఏ విధంగా చుట్టం అవుతావు అంటూ అధికారిని ప్రశ్నించారు. విధులకు నిర్లక్ష్యం చేస్తూ, స్పీకర్‌కు చుట్టం అవుతాను అంటూ చెప్పుకొని తిరగడం, రైతులను బెదిరించడం ఏమిటి అని ప్రశ్నించారు. వెంటనే చర్యలు తీసుకోవాలంటూ జిల్లా అధికారులకు ఆదేశించారు. పనిచేయడం ఇష్టం లేకపోతే ఏ అధికారి అయినా సరే రాజీనామా చేసి తమ సొంత పనులు చేసుకోవాలంటూ సూచించారు. తన నియోజకవర్గంలో విధుల పట్ల నిర్లక్ష్యం చేసిన ఏ అధికారిని వదిలి పెట్టేది లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రైతులకు మేలు చేయాలని ఉద్దేశంతో ప్రతి గ్రామంలో రైతు వేదికలు నిర్మించింది. ఈ రైతు వేదికల ద్వారా పలు అవగాహన సదస్సులు ఏర్పాటు చేసి వారికి ఏ కాలంలో ఏ పంటలు వేయాలంటూ స్థానిక వ్యవసాయగా అధికారులు చెప్పాలి. కానీ వారికి అవగాహన కల్పించాల్సిన అధికారులు రైతు వేదికల వైపు కూడా చూడకుండా వేదికలకు తాళాలు కూడా తీయడం లేదనీ డివిజన్ జిల్లా అధికారుల పర్యవేక్షణ ఎందుకు కరువైందని ప్రశ్నించారు. ఉన్నతాధికారుల నిర్లక్ష్యం వల్లనే కిందిస్థాయి అధికారులు పనిచేయడం లేదన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేసిన ఏ అధికారైనా సరే వారిని సస్పెండ్ చేస్తామన్నారు. వీరి వెంట జాయింట్ కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా పౌర సరఫరా అధికారి సి పద్మ, జిల్లా వ్యవసాయ అధికారి జే భాగ్యలక్ష్మి, అధికారులుచ నాయకులు పెరిక శ్రీనివాస్, మజీద్, రాము, కంది మల్లేష్, మారుతి పటేల్, పురం వెంకటరమణ గంగాధర్, తదితరులున్నారు.

కామారెడ్డి బస్టాండ్ జలమయం

నవతెలంగాణ-కామారెడ్డి(తాడ్వాయి)



జిల్లా కేంద్రంలోని బస్టాండు ప్రాంగణం జలమయమైంది. ఆదివారం రాత్రి సమయంలో కురిసిన భారీ వర్షంతో బస్టాండ్‌లోకి నీరు చేరి నిలిచింది. దీంతో ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ నుంచి బస్సులు బయటకు వచ్చే దారితో పెద్ద గుంత ఏర్పడటంతో నీరు నిలిచిపోయింది. అక్కడ గుంత ఎంత ఉందో అర్థం కాక లోపలికి వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే బస్సులు గుంతలో నుంచి వస్తుండటంతో నీళ్ల ప్రయాణీకులపై పడుతున్నాయి. బస్టాండు అంతా బాగానే ఉన్నా, బస్సులు స్టాండ్‌లో ఆపడానికి సీసీ ఉంది. కానీ బస్సులు బయటకు వెళ్లే దగ్గర, లోపలికి వచ్చే దగ్గర ఉన్న ఈ గుంతలను సీసితో పూడ్చి బాగుచేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

రక్తదానంతో ఎందరికో ప్రాణప్రతిష్ఠ

- జిల్లా జడ్జి సునీత

నవతెలంగాణ-కంఠేశ్వర్


రక్తదానం శిబిరం ప్రారంభించిన జిల్లా జడ్జి

జిల్లా న్యాయసేవ అధికార సంస్థ న్యాయవివాదాలను సామరస్యంగా పరిష్కరించబడంతో పాటు సామాజిక సేవారంగంలో కూడా తనవంతు బాధ్యతను పోషిస్తున్నదని సంస్థ చైర్ పర్సన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల తెలిపారు. జిల్లాకోర్టు ఆవరణలో గల న్యాయసేవ సదన్ లో అంతర్జాతీయ కార్మిక దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి ప్రసంగించారు. కార్మికుల సంక్షేమం కోసం ఎన్నో చట్టాలు రూపొందించారని తెలియజేస్తు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఎందరికీ ప్రాణప్రతిష్ట చేసినవారవుమతామని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాసు, ప్రభుత్వ వైద్యులు తిరుపతి,స్మిత న్యాయవాదులు, సిబ్బంది, కోర్టు డ్యూటీ పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

సఫాయి కార్మికులకు సన్మానం

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మే డే సందర్భంగా మండలంలోని అర్గుల్ గ్రామంలో సర్పంచ్ ఉప సర్పంచ్ పద్మ రాజేందర్ ఆధ్వర్యంలో గ్రామపంచాయతీలో పనిచేసే సఫాయి కార్మికులను సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సమాజంలో అందరికన్నా గొప్ప కార్మికులు సఫాయి సిబ్బంది అని అన్నారు. అందరూ ఆరోగ్యంగా ఉండటానికి వారు నిత్యం కష్టపడుతూ పరిశుభ్రతకు పాటుపడతారని వారి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్స్ గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్



రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేసిన సందర్భంగా యూనివర్సిటీ కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను కూడా రెగ్యులర్ చేయాలని తెలంగాణ యూనివర్సిటీలోని కాంట్రాక్ట్ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ దత్త హరి డిమాండ్ చేశారు. జూనియర్ కాలేజ్ కాంట్రాక్ట్ అధ్యాపకులను, డిగ్రీ కళాశాల కాంట్రాక్ట్ అధ్యాపకులను ఏ విధంగా రెగ్యులర్ చేశారో తెలంగాణ రాష్ట్ర సాధనలో యూనివర్సిటీ కాంట్రాక్ట్ అధ్యాపకులు సైతం కీలక పాత్ర పోషించారని, ఆ ఉద్యమాన్ని రాష్ట్ర ప్రభుత్వం దష్టిలో ఉంచుకొని 11 యూనివర్సిటీలలో పనిచేస్తున్న 1350 కాంట్రాక్టర్ అధ్యాపకులు కూడా రెగ్యులర్ చేయాలని కోరారు.

నాలుగవ డివిజన్‌లో జెండావిష్కరణ

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్



మేడే సందర్భంగా నాలుగవ డివిజన్ పరిధిలో గల పాంగ్ర బ్యాంక్ కాలనీ సుందరయ్య నగర్ లో సిఐటియు, సిపిఎం ఆధ్వర్యంలో ఆ పార్టీ అధ్యక్షులు అహ్మద్ ఖాన్ జెండా ఎగురవేసి కార్మికుల దినోత్సవం జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు భీమ్ శంకర్, భరత్, కృష్ణ, నరేష్, పోసాని, రుక్మిణి శ్యామల, తదితరులు పాల్గొన్నారు.

అహ్లాదం.. వినోదం.. కేరాఫ్ ఎగ్జిబిషన్

- నేడు ప్రారంభం
- ఏర్పాటైన స్టాళ్లు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని పాలిటెక్నిక్ మైదానంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ అనుమతితో 40వ నిజామాబాద్ ఇండస్ట్రియల్ అగ్రికల్చర్ ఎగ్జిబిషన్ 2023ను నేడు ప్రారంభించనున్నారు. సెలవులు రావడంతో పాలిటెక్నిక్ మైదానంలో నిజామాబాద్ ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. నిజామాబాద్ నగరంలోని ఆర్మూర్ రోడ్డులోగల సువిశాలమైన ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో ఇండస్ట్రియల్ అగ్రికల్చర్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేయనున్నారు. వేసవిలో వినోదం కోసం ప్రతిఎండాకాలం ఎగ్జిబిషన్ ఏర్పాటుచేస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న వ్యాపారులు వస్తువులను విక్రయించడానికి స్టాల్సు ఏర్పాటు చేశారు.

డ్రెస్ మెటీరియల్స్, అన్నిరకాల ఆటవస్తువులు, ఫ్యాన్సీ వస్తువులు, వివిధ రకాల తినుబండాల దుకాణాలు ఏర్పాటుచేశారు. ఉత్తర దక్షిణ భారత వంటకాలు, చాట్లు, మిర్చి బజ్జీలు, పాపడ్లు జ్యూస్ సెంటర్లను అందించే ఫుడ్ కోర్ట్ ఏర్పాటు పూర్తయ్యాయి. 40వ ఎగ్జిబిషన్ సందర్భంగా మొత్తం షాపింగ్ స్టాళ్లు 200 పైగా ఉండగా ఇందులో 150 వరకు గేమ్స్ సంబంధించిన బ్రేక్ డాన్స్, డోరా, కొలంబస్, ఎరోప్లేన్ వంటి చిన్న పిల్లలకి సంబంధించినవి ఇలా ఎన్నో రకాలు అందుబాటులో ఉంచారు. పెద్దవారి కోసం సుమారు 20 నుండి 40 వరకు గేమ్స్ వస్తువులను ఏర్పాటు చేశారు. చాయ్, కూల్ డ్రింక్స్, జ్యూస్ తదితర వాటిని స్టాళ్ళను ఏర్పాటు చేశారు.1967లో జాయింట్ కలెక్టర్ చైర్మన్‌గా ఏర్పాటైన ఎగ్జిబిషన్ సొసైటీ ప్రతి సంవత్సరం ఎగ్జిబిషన్ నిర్వహిస్తుంది. సాధారణంగా 40 రోజుల నుండి 50 రోజుల పాటు జరుగుతుంది. జరిగే ఈ ప్రదర్శనలో వ్యాపారులు సందర్శకుల కోసం సొసైటీ తాగునీరు, విద్యుత్ ఇతర సౌకర్యాలను అందిస్తుంది.

స్టాల్స్ సందర్శకుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంది. కానీ సొసైటీకి ఎటువంటి భూమి లేదు. శాశ్వత స్థాపన కోసం తొలుత పాలిటెక్నిక్ గ్రౌండ్ తరలించే ముందు ఖలీల్వాడి మైదానంలో ఎగ్జిబిషన్ నిర్వహించారు. సొసైటీ ప్రధాన కార్యదర్శి బంటు రాజేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎగ్జిబిషన్ సొసైటీకి అధ్యక్షతగా నిజామాబాద్ అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ వ్యవహరిస్తున్నారు. ఉపాధ్యక్షులుగా నరసింహులు తదితర కార్యవర్గ సభ్యులు ఈ ఎగ్జిబిషన్ సొసైటీని నడుపుతున్నారు.



ఎగ్జిబిషన్ ముఖద్వారం

జాయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్, కొలంబస్‌తో సహా 15 వినోద సవారీలతో పాటు 250 స్టాల్స్ ఉన్నాయి. ఈ సంవత్సరం బొమ్మలు, టాయ్ రైళ్లు ఏర్పాటు చేయబడ్డాయి. ఎగ్జిబిషన్‌కు రోజుకు 3వేల నుండి 4వేల మంది సందర్శకులు వస్తుంటారు. ఆదివారాల్లో సుమారు 6వేల మంది సందర్శకులు ఉంటారని ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బంటు రాజేశ్వర్ చెప్పారు. ప్రవేశ టిక్కెట్ ధర అదనపు కలెక్టర్ నిర్ణయించిన విధంగా పాత పద్ధతిలోనే ఉంది. ఒకవేళ పెంచితే ఐదు రూపాయలు పెంచే అవకాశం ఉంటుంది అని తెలుపుతున్నారు. ప్రదర్శన సాయంత్రం సుమారు 5 నుండి ప్రారంభం కాగా రాత్రి 10.30 నుండి 11 గంటల వరకు తెరిచి ఉంటుంది. రాష్ట్రంలో హైదరాబాద్ వెలుపల ఉన్న ఏకైక ప్రదర్శన కావడంతో దూర గ్రామాల ప్రజలు కూడా ఈ ప్రదర్శనను సందర్శిస్తున్నారని నిజామాబాద్ ఎగ్జిబిషన్ సొసైటీ వారు తెలిపారు.

ఎగ్జిబిషన్‌ను పర్యవేక్షించిన ఎగ్జిబిషన్ కార్యవర్గ సభ్యులు..

ఎగ్జిబిషన్ పనులు పూర్తయ్యావు లేదో రెండు రోజులుగా నిజామాబాద్ ఎగ్జిబిషన్ సొసైటీ ప్రధాన కార్యదర్శి బంటు రాజేశ్వర్‌తో పాటు నరసింహులు ఉపాధ్యక్షులు ఎప్పటికప్పుడు పర్యవేకించారు. నేడు నిజామాబాద్ ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిజామాబాద్ పోలీస్ కమిషనర్‌కు రాతపూర్వకంగా లెటర్ ఇవ్వడం జరిగిందని, ఎలాంటి అల్లర్లు పుకార్లు నమ్మవద్దని, గొడవలకు తాగునీవకుండా పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. దొంగతనాలు జరగకుండా సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎంట్రెన్స్ ఒకవైపు ఔటింగ్ ఒకవైపు ఏర్పాటు చేస్తున్నామన్నారు ప్రజలకు అహ్లాదకరమైన వాతావరణం తలపించేలా అన్ని అందుబాటులో ఉంచామన్నారు. ఎలాంటి సమస్య ఉన్న వెంటనే అక్కడ ఎగ్జిబిషన్ సొసైటీలో సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



ఎగ్జిబిషన్‌లో ఏర్పాటుచేసిన జాయింట్‌వీల్, బ్రేక్‌డ్యాన్స్, కొలంబస్

సమ్మె నోటీస్ అందించిన జీపీ కారోబార్లు, సిబ్బంది

నవతెలంగాణ-ఏర్గట్ల

పంచాయతీ సిబ్బంది, కారోబార్ల న్యాయమైన సమస్యలు, డిమాండ్లు పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని సోమవారం టీజీకేఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలుక మారుతి, జిల్లా అధ్యక్షులు సురాజి సుధాకర్ ఆధ్వర్యంలో నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, జిల్లా పంచాయతీ అధికారి (డిపిఓ) జయసుధకు సమ్మె నోటీసు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ... సమస్యలపై ఈ నెల 5వరకు సానుకూలంగా స్పందించకపోతే సమ్మెబాట పడతామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ గౌడ్, ఉపాధ్యక్షులు సాయన్న, సభ్యులు చిన్నయ్య, బాలాజీ, సురేష్, జీపీ సిబ్బంది, కారొబార్లు పాల్గొన్నారు.



కళ్లకు గంతలతో కార్యదర్శుల నిరసన

నవతెలంగాణ-భీంగల్

ప్రభుత్వం తమను రెగ్యులర్ చేసి తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెలో సోమవారం మండలపరిషత్ కార్యాలయ ఆవరణలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. వీరికి సీనియర్ పంచాయతీ కార్యరదర్శులు, కారోబార్లు, కంప్యూటర్ ఆపరేటర్లు సంఘీభావం తెలిపి మాట్లాడారు. నాలుగు సంవత్సరాలు నుండి గ్రామాల అబివృద్ధిలో నిర్విరామంగా విధులు నిర్వహిస్తున్నారని, సీఎం కేసీఆర్ వారికి ఇచ్చిన హమీ ప్రకారం రెగ్యులర్ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించలని కోరారు. నిరసనలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు శేఖర్, గణేష్,,కిషన్, శ్రీకర్,రాజు సంజయ్, హేమ, అనూష తదితరులున్నారు.

సిరికొండ: మండలంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కండ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలిపారు. దీనికి సీనియర్ పంచాయతీ కార్యదర్శులు మద్దతు తెలిపారు. ప్రొబేషనరీ కాలాన్ని సర్వీస్ కాలంగా గుర్తించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో సిరికొండ మండలం పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షులు శ్రీకాంత్, ఉపాధ్యక్షుడు మహేష్, ప్రధాన కార్యదర్శి సుమన్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌కి 16 మంది ధర్మారం గురుకుల విద్యార్థులు



నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ధర్మారం (బి) గ్రామంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల ప్రతిభ కళాశాలకు చెందిన 16 మంది విద్యార్థులు జే ఈ ఈ మెయిన్ పరీక్షల్లో నెగ్గి జే ఈ ఈ అడ్వాన్స్ కి అర్హత సాదించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ సంగీత సోమవారం తెలిపారు. ఇటీవల ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థుల్లో 37 విద్యార్థులు మెయిన్స్ పరీక్షలకు హాజరు అవ్వగా 16 మంది విద్యార్థులు అడ్వాన్స్‌కి అర్హత సాధించారు వీరిలో ఆర్ ధనలక్ష్మి 87.84 , ఎస్ సాహితి 85.01 , జి నీహారిక 81.14, యం సౌందర్య80.50 , ఏ దివిజ 77.64 , కే సిరివెన్నెల76.49 , యం చామంతి 75.78 పర్సంటేజ్ సాధించారు వీరికి దేశం లోని యన్ ఐ టి లో సీటు వస్తుందని తెలిపారు. విద్యార్థులను ప్రాంతీయ సమన్వయ కర్త మేరీ యేసు పాదం , కళాశాల ప్రిన్సిపాల్ సంగీత, అధ్యాపక బందం అభినందనలు తెలిపారు.

పెద్దమ్మతల్లి ఆలయానికి భూమిపూజ

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

ధర్మారం గ్రామంలో ముదిరాజ్ సంఘం అధ్వర్యంలో పెద్దమ్మ తల్లి ఆలయానికి భూమి పూజ చేశారు. సర్పంచ్ రాం గోపాల్ రెడ్డి ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు నారాయణ, ఉప సర్పంచ్ దాసరి శ్రీనివాస్, జక్కుల మల్లేశ్, సాయిలు, గోపి, సతీష్, కిషన్ మేస్త్రి, రాజు గ్రామ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హక్కులకోసం మేడే స్ఫూర్తితో ఉద్యమించాలి

- కార్మిక సంఘాల నాయకుల పిలుపు
- ఘనంగా 137వ మేడే ఉత్సవాలు

మేడే ఉత్సవాలు సోమవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎర్రజెండాలను ఎగురవేశారు. కార్మికులు హక్కులకోసం చికాగో అమరుల స్ఫూర్తితో ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

నవతెలంగాణ-విలేకరులు

ఆర్మూర్ :పట్టణ టిఎస్‌ఆర్టిసి డిపోలో డిపో అధ్యక్షులు రవి చందర్ ఆధ్వర్యంలో మే డే జెండాను గోపి ఆవిష్కరించారు. డిపో కార్యదర్శి అర్గుల్ రమేష్, కోశాధికారి సిసిఎస్ ప్రసాద్ డిపో కార్మికులు సిపిఎం పార్టీ కార్యకర్తలు, సిపిఎం డివిజన్ సెక్రటరీ వెంకటేష్, టౌన్ సెక్రటరీ ఎల్లయ్య మేడే గురించి వివరించారు. డిపో ఎస్‌టిఓ మేడే రోజు ఎవరికి సెలవు ఇవ్వకుండా కార్మికులను కార్మక నాయకులకు భయాందోళనకు గురి చేయడం పట్ల తీవ్రంగా ఖండిస్తున్నట్టు తెలిపారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ఏఐటియుసి డివిజన్ కార్యదర్శి ఆరేపల్లి సాయిలు ఆధ్వర్యంలో, ఐఎఫ్‌టియు జిల్లా అధ్యక్షులు ముత్తెన్న ఆధ్వర్యంలో, పట్టణంలోని పెర్కిట్‌చ మామిడిపల్లిలో సిపిఐఎంఎల్, ఐఎఫ్టియు జిల్లా ప్రధాన కార్యదర్శి దాస్ ఆధ్వర్యంల, సిపిఐఎంఎల్ రామచంద్రన్ పార్టీ జిల్లా కార్యదర్శి పోగుల నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో, మున్సిపల్ కార్మికుల అధ్యక్షులు బాబురావు ఆధ్వర్యంలో మేడే వేడుకలు నిర్వహించారు.

ముప్కాల్: శివసాయి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ముప్కాల్ మండల కేంద్రంలో ఆటో యూనియన్ నాయకులు మేడే నిర్వహించారు.

సిరికొండ :మండలకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పెద్ది వెంకట్రాములు మండల కేంద్రంలో మేడే జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... కార్మికుల హక్కులు కాలరాస్తున్న బిజెపి ప్రభుత్వం హేయమైన చర్యలు మానుకోవాలని, పోరాడి 8గంటలు పని సాధించుకుంటే 12 గంటలు చేయడం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్మికుల హక్కులు కాలరాసే హక్కు ఏ ప్రభుత్వానికి లేదని అన్నారు. కార్యక్రమంలో నిజామాబాదు జిల్లా కమిటీ సభ్యురాలు గోలేం లక్ష్మి, జిల్లా కమిటీ సభ్యుడు బాదే వినోద్, లక్ష్మి నర్సయ్య ,గోవర్ధన్ , రాకేష్, గంగరాజు, ప్రశాంత్, గౌతమ్ పాల్గొన్నారు.

కంఠేశ్వర్:అసంఘటితరంగ కార్మికుల సంక్షేమంకోసం కార్మికవర్గం ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని బిఎల్టియు రాష్ట్ర అధ్యక్షులు దండి వెంకట్ పిలుపునిచ్చారు. బహుజన లెఫ్ట్ ట్రేడ్ యూనియన్స్ (బి ఎల్ టి యు) ఆధ్వర్యంలో నగరంలో 30 ప్రాంతాల్లో బిఎల్‌టియు నీల్ లాల్ జెండా ఆవిష్కరణలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద మేడే బహిరంగ సభ నిర్వహించారు. తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం (బీఎల్‌టీయూ) రాష్ట్ర కార్యలయం ముందు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు జెండా అవిష్కరణ చేశారు.

దేశాభివృద్ధిలో కార్మికులపాత్ర కీలకం అని మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్ అన్నారు. భారతీయ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరణ చేశారు. కార్మిక, కర్షకులకషి తోనే రాష్ట్ర అభివద్ధి ముడిపడి ఉందని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఎన్నో అభివద్ధి కార్యక్రమాల్లో కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని అన్నారు.

తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో నిజామాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట రాష్ట్ర కార్యదర్శి మల్యాల గోవర్ధన్ సిఐటియు జెండాను ఆవిష్కరించారు. వారం రోజులపాటు ఘనంగా ఉత్సవాలను నిర్వహించాలని పిలుపునిచ్చారు. శ్రద్ధానంద్ గంజిలో బార్దాన్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సిఐటియు జెండాను యూనియన్ అధ్యక్షులు దండే రాము ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు మల్యాల గోవర్ధన్ మాట్లాడారు.

ధర్పల్లి :అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం(ఏఐపీకేఎంఎస్)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి రామకష్ణ మండల కేంద్రంలో మేడే నిర్వహించారు. కార్యక్రమానికి సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా మండల కార్యదర్శి బి.బాబన్న అధ్యక్షత వహించారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టియు) సుత్తి, కొడవలి జెండా ను ఐ ఎఫ్ టి యు జిల్లా కార్యదర్శి ఆర్ రమేష్ ఆవిష్కరించారు .

మాక్లూర్ :మండలంలోని మాదాపూర్ గ్రామ శివారులో గల బ్యావరేజ్ లిక్కర్ ఐఎంఎల్ డిపో వద్ద సీఐటీయూ మండల కార్యదర్శి కొండగంగాధర్ ఎగురవేశారు. అనంతపురం దాస్ నగర్, మాణిక్ బండారు, ఆర్టీసీ కాలనీలోని మహాలక్ష్మి నగర్ లో మేడే ఉత్సవాలు నిర్వహించారు. మండలంలోని మామిడిపల్లి గ్రామంలో వడ్డెర వత్తిదారుల సంఘం అధ్వర్యంలో సంఘం జెండాను జిల్లా అధ్యక్షులు ఇడగొట్టి సాయిలు ఎగురవేశారు.



ఆర్మూర్‌లో జెండావిష్కరించిన పల్లపువెంకటేష్

నిజామాబాద్ సిటీ :తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తుందని పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ మండిపడ్డారు. తెలుగుదేశం పార్టీ నిజామాబాద్ పార్లమెంట్ కార్యాలయంలో టీఎన్‌టీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన మేడే సంబరాల్లో పార్టీ కార్యాలయంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన పార్లమెంట్ అధ్యక్షులు దేగాం యదాగౌడ్ మేడే జెండాను ఎగురవేశారు. అనంతరం అర్బన్ కోఆర్డినేటర్ ఆదేశానుసారం, నగర అడక్ కమిటీ కోఆర్డినేటర్, రాష్ట్ర టీఎన్‌టీయూసి కార్యదర్శి కోయేడి నర్సింలు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ టిఎన్‌టీయూసి అధ్యక్షులు రఫిక్ ఖాన్ అధ్యక్షతన సభ నిర్వహించారు. పలువురు కార్మికులకు సన్మానం చేశారు. నగరానికి చెందిన పలువురు నాయకులు తెలుగుదేశం పార్టీలో చేరారు. కార్యక్రమంలో దేగాం యదా గౌడ్ మాట్లాడుతు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను హరిస్తుందని మండిపడ్డారు. హక్కులను కాపాడుకునేందుకు కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో బీడీ యూనియన్, మధ్యాహ్న భోజనం, మున్సిపల్ వర్కర్స్ యూనియన్, ఆటో వర్కర్స్ యూనియన్, నాయిని బ్రాహ్మణ వర్కర్స్ యూనియన్, టైలరింగ్ వర్కర్స్ యూనియన్, తదితర రంగాల కార్మికులు హాజరయ్యారు.

జక్రాన్‌పల్లి:తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) మండల అధ్యక్షుడు సోప్పరి గంగాధర్ మండలకేంద్రంలో మే డే సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. రాష్ట్ర అధ్యక్షులు దాసు దాసు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు.

డిచ్‌పల్లి:ఇందల్‌వాయి, డిచ్‌పల్లి మండల కేంద్రాలలో అంబేద్కర్ చౌరస్తా, పెట్రోల్ బంక్ వద్ద మే డే జెండా ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు, మండల అధ్యక్షులు మాదరి గంగాధరం ఆధ్వర్యంలో మేడే జెండా తోపాటు సిపిఎం పార్టీ జేండాలను ఎగుర వేశారు.

నిజామాబాద్‌సిటీ:నిజామాబాద్ నగరంలోగల కోటగల్లీ లోని నీలం రాంచంద్రయ్య భవన్ ముందు సీపీఐ(యం-యల్) న్యూ డెమోక్రసీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపయ్య సుత్తి కొడవలి జెండాను ఎగురవేశారు. కోటగల్లీ భగత్‌సింగ్ చౌరస్తాలో ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు నీలం సాయిబాబా, ద్వారాకనగర్ ఐఎఫ్టియు కార్యాలయం ముందు బిటిసి రాష్ట్ర అధ్యక్షులు జెల్ల మురళి, ఖానాపూర్ రోడ్లోని కోల్డ్ స్టోరేజ్ ముందు హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం శివ కుమార్ ఐఎఫ్టియు జెండా అవిష్కరణ చేశారు. అదేవిధంగా అర్సపల్లి లో న్యూ డెమోక్రసీ నాయకులు నాయక్వాడ్ నర్సయ్య, వర్ని చౌరస్తా, మేఘన డెంటల్ కాలేజ్ ల వద్ద, సాయినగర్ లో తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో, కూరగాయల మార్కెట్ లో ముల్లె హమాలీ అధ్యక్షులు మోహన్, కూరగాయల గంజ్ లో రిక్షా కార్మికుల ఆధ్వర్యంలో, గౌతంనగర్‌లో ప్లంబర్స్ యూనియన్ అధ్యక్షుడు యెల్లప్ప అధ్వర్యంలో, నెహ్రూ పార్క్ లోనీ అడ్డ కూలీల వద్ద పిడిఎస్యూ ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ అధ్వర్యంలో మేడే జెండాల ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం కోటగల్లీ ఎన్ ఆర్ భవన్ లో సభ నిర్వహించారు. నాగారంలో ఐఎఫ్టియు జిల్లా ఉపాధ్యక్షులు శివరాజ్ మేడే జెండా ఎగురవేశారు.



మాక్లూర్‌లో జెండా ఆవిష్కరించిన కొండ గంగాధర్

భీంగల్: పట్టణకేంద్రంలో పలు కార్మిక సంఘలు ఘనంగా జరుపుకున్నారు. సిఐటియు నాయకురాలు ప్రమీల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకుర్తలు ఐసిడిఎస్ కార్యాలయం ముందు జెండాను ఎగురవేశారు. సిపిఐఎం ప్రజాపంథ నాయకులు రాజేశ్వర్, నడిపి నర్సయ్యలు , బీడి కార్మికులు కలిసి బస్టాండ్ ప్రాంతంలో జెండాను ఎగురవేశారు.

కంఠేశ్వర్:కేంద్ర ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలని నవతెలంగాణ రీజినల్ మేనేజర్ సురేష్ డిమాండ్ చేశారు. నగరంలోని సుభాష్ నగర్‌లోగల కార్యాలయంలో మేడే సందర్భంగా జెండాను మేనేజర్ సురేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మిక చట్టాలను, రక్షణ చట్టాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హరిస్తున్నాయని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్లకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకొని చట్టాలను చేస్తూ ప్రజలపై భారాన్ని మోపుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది డెస్క్ఇన్‌ఛార్జి మధు, స్టాఫర్ భాస్కర్, డెస్క్‌జర్నలిస్టులు అనిత, కృష్ణ, సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి గంగాధర్ ఎడివిటి సిబ్బంది గోపి, నవీన్, సిబ్బంది శ్రావ్య, సంతోషి, నితిన్ గౌడ్, నరేంద్ర, జర్నలిస్టులు రాజు, ప్రవీణ్, పాల్గొన్నారు.



సిరికొండలో...



నిజామాబాద్‌సిటీ : టీడీపీ కార్యాలయంవద్ద జెండా ఆవిష్కరించిన దేగాంయాదాగౌడ్



కంఠేశ్వర్: నవతెలంగాణ కార్యాలయంలో..



డిచ్‌పల్లి :ఇందల్‌వాయిలో..

వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-భిక్కనూర్



మండలంలోని మల్లుపల్లిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో సొసైటీ చైర్మన్ బాలగోని రాజాగౌడ్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రంలో విక్రయించాలని, రైతులు పండించిన ప్రతి గింజనూ కొనుగోలు చేసేంతవరకు కొనుగోలు కేంద్రాన్ని ఉంచుతామని తెలిపారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని, రైతులు ఎవరు ఆందోళన చెందవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లపు శంకర్, సిద్ధారెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

పోతురాజు సుభాష్‌కు దళిత రత్న అవార్డు

నవతెలంగాణ-బోధన్



బోధన్ మున్సిపల్ పరిధిలోని శ్రీనివాసనగర్ క్యాంపునకు చెందిన పోతురాజు సుభాష్‌కు ఆదివారం మహనీయుల జయంతి సందర్భంగా దళిత సేన జాతీయ అధ్యక్షులు జేసీ రాజు దళిత రత్న అవార్డును ప్రదానం చేశారు. ఈ సందర్భంగా సుభాష్‌కు నాయకులు శాలువాతో ఘనంగా సత్కరించారు. అలాగే మంధర్న గ్రామానికి చెందిన విఠల్ వారి చేతుల మీదుగా దళిత రత్న అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో సెంట్రల్ వేర్ హౌస్ ఉభయ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పరిమి కోటేశ్వర్‌రావు, బోధన్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్, బోధన్ నియోజకవర్గ బీఎస్పీ ఇంచార్జి పాండు, నీరడి రవి పాల్గొన్నారు.

కార్మికులకు మంచి భవిష్యత్తు

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్



భిక్కనూర్ : వరి పంటను పరిశీలిస్తున్న కలెక్టర్

నవతెలంగాణ-తాడ్వాయి/భిక్కనూర్

చేసే పనిలో మెళకువలు, నైపుణ్యాలు నేర్చుకుంటే కార్మికులకు మంచి భవిష్యత్తు ఉంటుందని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని బాలుర పాఠశాలలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవం సోమవారం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. భవన నిర్మాణ కార్మికులకు ఆరోగ్య శిబిరాన్ని జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆరోగ్య శిబిరాలు నిరంతరాయంగా కొనసాగుతాయని తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న భవన నిర్మాణ కార్మికులందరూ ఆరోగ్య పరీక్షలు చేసుకోవాలని కోరారు. జర్నలిస్టులకు డ్రైవర్లు, హోంగార్డులకు రూ.5లక్షల ప్రమాద బీమా ప్రీమియాన్ని రాష్ట్ర కార్మిక శాఖ చెల్లిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలను కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. భవన నిర్మాణ కార్మికులు రిజిస్ట్రేషన్ చేసుకోకపోతే తక్షణమే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. కార్మికులకు మే డే శుభాకాంక్షలు చెప్పారు. కార్మికులు తాము చేస్తున్న పనిని తక్కువ అంచనా వేసుకోవద్దని సూచించారు. కుట్టు మిషన్ శిక్షణ పొందిన మహిళలు ఆర్థికంగా ఎదగవచ్చని చెప్పారు. ఈ సందర్భంగా కార్మిక సంఘ ప్రతినిధులు మాట్లాడారు. జిల్లా కార్మిక సంక్షేమ భవన నిర్మాణానికి ఇలిచిపూర్ శివారులో ఎకరం స్థలాన్ని కేటాయించారని చెప్పారు. ఈ విధంగా పూర్తిస్థాయిలో ఎకరం స్థలాన్ని కేటాయించింది కామారెడ్డి జిల్లా రాష్ట్రంలోని ప్రథమం. ఇందుకు కృషి చేసిన జిల్లా కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కార్మిక సంక్షేమ అధికారి సురేంద్ర కుమార్ మాట్లాడారు. భవన నిర్మాణ కార్మికులకు చర్మ, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు అధికంగా ప్రబలే వీలుందని తెలిపారు. భవన నిర్మాణం సంక్షేమ మండలి, సీఎస్సీ హెల్త్ కేర్ ద్వారా 50 రకాల వైద్య పరీక్షలను కార్మికుల వద్దకు వచ్చి పరీక్షలు చేసి ఆరోగ్య కార్డును అందజేస్తారని చెప్పారు. అవసరమైతే దగ్గర్లోని ఆసుపత్రికి సిఫారసు చేస్తారని పేర్కొన్నారు. నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ న్యాక్ సెంటర్ కామారెడ్డిలో మేషన్, ప్లంబర్, పెయింటర్, హౌస్ ఎలక్ట్రీషన్, టైలరింగ్‌లలో శిక్షణ విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లను, కుట్టు మిషన్లను అందజేసినట్లు చెప్పారు. ఈ సంవత్సరం భవన నిర్మాణ కార్మికులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా 594 మందికి లబ్ధి చేకూర్చినట్టు పేర్కొన్నారు. న్యాక్ ద్వారా నైపుణ్య అభివృద్ధి కోసం 506 మంది తమ శిక్షణను పూర్తి చేసుకున్నారు. సెట్విన్ ద్వారా భవన నిర్మాణం కార్మికుల పిల్లలకి సాంకేతిక విద్యను 90 రోజుల పాటు అందించినట్లు చెప్పారు. 800 మంది శిక్షణ పొందినట్లు ఆయన పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాలో ఒక లక్ష 49 వేలకు పైగా అసంఘటిత కార్మికులు ఇస్రం పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకున్నట్లు తెలియజేశారు. గ్రామీణ అభివృద్ధి శాఖ ద్వారా బీడీ కార్మికులకు, కల్లుగీత కార్మికులు, చేనేత కార్మికులకు జీవనభృతిని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సహాయ కార్మిక అధికారి కమ్రుద్దీన్, న్యాక్ సెంటర్ ఇంచార్జ్ లింబాద్రి, సీఎస్సీ హెల్త్ కేర్ జిల్లా ఇంచార్జ్ శశికాంత్, ప్రతినిధులు, కార్మికులు పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలి..

భిక్కనూర్ : వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో సందర్శించి పంట నష్టపోయిన రైతుల వివరాలు సేకరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించారు. సోమవారం మండలంలోని పెద్ద మల్లారెడ్డి గ్రామంలో అకాల వర్షంతో దెబ్బతిన్న వరి పంటను పరిశీలించారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతులు కలెక్టర్‌ను కోరారు. అనంతరం నష్టపోయిన రైతుల వివరాలు డాటా ఎంట్రీ చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీ రాజలింగం, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హన్మంత్ రెడ్డి సొసైటీ చైర్మన్ రాజాగౌడ్, ఎంపీటీసీ సాయగౌడ్, ఎంఆర్ఒ ప్రేమ్ కుమార్, అగ్రికల్చర్ అధికారులు, రైతులున్నారు.

తడిసిన ధాన్యం పరిశీలన

నవతెలంగాణ-దోమకొండ

మండల కేంద్రంలో గత మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు వరి ధాన్యం తడిసిపోవడంతో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జడ్పీటీసీ తిర్మల్‌గౌడ్, ప్రజా ప్రతినిధులు, అధికారులు సోమవారం పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కౌశిక, వ్యవసాయ అధికారి పవన్, సొసైటీ చైర్మన్ పన్యాల నాగరాజురెడ్డి, మాజీ ఎంపీటీసీ నల్లపు శ్రీనివాస్, సెక్రటరీ బాల్‌రెడ్డి, ఆర్ఐ రైతులు పాల్గొన్నారు.

336 ఎకరాల్లో దెబ్బతిన్న వరి పంట

నవతెలంగాణ-మద్నూర్

మద్నూర్, డోంగ్లి మండలాల పరిధిలోని పలు గ్రామాల్లో వడగండ్ల వానకు 336 ఎకరాల్లో వరి పంట దెబ్బతిన్నట్లు మండల వ్యవసాయ అధికారి రాజు ఒక తెలిపారు. సోమవారం ఇరు మండలాల పరిధిలోని సుల్తాన్‌పేట్, శేఖపూర్, లచ్మపూర్, మొఘ, మెనూర్, సిర్పూర్ గ్రామాల్లో పంట నష్టం వాటిల్లినట్టు వివరించారు. కార్యక్రమంలో సుల్తాన్‌పేట్ ఎంపీటీసీ, ఏఈఓ, సంయుక్త రైతులు పాల్గొన్నారు.

మేడే సందర్భంగా కార్మికులకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-బోధన్/మద్నూర్

బోధన్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను ఘనంగా నిర్వహించారు. మేడేను పురస్కరించుకొని ఏఎంసీ చైర్మన్ వి.ఆర్ దేశాయి 40 మంది కార్మికులకు నూతన దుస్తులను పంపిణీ చేశారు. అనంతరం ఆర్డీవో చేతుల మీదుగా వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆర్డీవో రాజేశ్వర్ మాట్లాడుతూ మేడేను కార్మికులు ఘనంగా జరుపుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ సాలురా షకీల్, ఏఎంసీ కార్యదర్శి పూర్య నాయక్, డైరెక్టర్ వినోద్, సీనియర్ నాయకులు బుద్దె రాజేశ్వర్ ఉన్నారు.

హమాలీ కార్మికులకు దుస్తులు పంపిణీ..

మద్నూర్ : అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డే సంద్భంగా మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలకవర్గం సభ్యులు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో హమాలీ కూలీలకు దుస్తులను చైర్మన్ సంగమేశ్వర్‌తో పాటు పాలకవర్గం సభ్యులు డైరెక్టర్లు పంపిణీ చేశారు. మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలో 18 మంది హమాలీలు లైసెన్సులు కలిగి ఉన్నట్లు చైర్మన్ పాలకవర్గం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, కార్మిక సంఘం అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



మద్నూర్ : కార్మికులకు దుస్తులు పంపిణీ



బోధన్ : మేడే వేడుకల్లో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు



గాంధారిలో..



దోమకొండలో..

ఎగిరిన ఎర్రజెండా

- ఘనంగా మేడే వేడుకలు
- కార్మికులు ఐక్యంగా ఉండాలని పిలుపు

నవతెలంగాణ-విలేకరుల బృందం

మేడేను పురస్కరించుకుని ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎర్రజెండా రెపరెపలాడింది. ప్రపంచ కార్మిక దినోత్సవం (మేడే) సందర్భంగా పలు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 137 సంవత్సరాల క్రితం అమెరికాలోని చికాకో నగరంలో 8గంటల పనిదినాలకోసం జరిగిన పోరాటంలో వందలాది మంది కార్మికులు ప్రాణత్యాగాలు చేశారని తెలిపారు. ఆనాడు సాధించుకున్న కార్మిక చట్టాలను అమలు చేయాలని ఒక వైపు పోరాడుతుంటే.. మనదేశంలో కేంద్రం ప్రభుత్వం ఆ చట్టాలను నిర్వీర్యం చేస్తూ కొత్తగా 4 లేబర్ కోడ్లు తీసుకొచ్చి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా చేస్తుందని, ప్రస్తుత పరిస్థితిలో మేడే సందర్భంగా కార్మికులు అందరూ కలిసి ఐక్యంగా పోరాడి మన హక్కులను కాపాడుకోవాలని కోరారు.



జుక్కల్ : సీఐటీయూ ఆధ్వర్యంలో..



ఎడపల్లిలో..



లింగంపేట్ : సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో..



నసురుల్లాబాద్ : సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో..



పిట్లంలో..



రామారెడ్డిలో..



వర్నిలో..



ఎల్లారెడ్డి : సీఐటీయూ ఆధ్వర్యంలో..

క్రమబద్ధీకరించాలి

- 4వ రోజుకు జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమ్మె
- పలుచోట్ల భారీ ర్యాలీ, కండ్లకు గంతలు కట్టుకుని నిరసన

నవతెలంగాణ-విలేకరుల బృందం



ఎల్లారెడ్డి : ర్యాలీలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు



కామారెడ్డిలో అంబేద్కర్ విగ్రహానికి వినతి

తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని కోరుతూ గత 4 రోజులుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరవధిక సమ్మె చేస్తున్నారు. అందులో భాగంగా సోమవారం పలుచోట్ల నిరసనలు చేపట్టారు.

నసురుల్లాబాద్ : బాన్సువాడ పట్టణంలో డివిజన్ స్థాయిలో జీపీ కార్యదర్శులు భారీ ర్యాలీ నిర్వహించారు. బన్సువాడ ఎంపీడీఓ కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ కొనసాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ.. మూడు సంవత్సరాల పాటు ప్రొహిబిషన్ తర్వాత రెగ్యులర్ చేస్తామని చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్ నాలుగు సంవత్సరాలు గడిచినప్పటికీ తమను రెగ్యులర్ చేయడం లేదన్నారు. కాలయాపన చేస్తూ మా భవిష్యత్తుతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎల్లారెడ్డి : ఎల్లారెడ్డి పట్టణ కేంద్రంలో ఎల్లారెడ్డి డివిజన్ గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో భాగంగా ఎల్లారెడ్డి డివిజన్‌లోని నాలుగు మండలాల గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ ర్యాలీ ఎంపీడీఓ కార్యాలయం నుంచి గాంధీ చౌక్ వరకు కొనసాగించారు. కార్యక్రమంలో పంచాయతీ కో ఆర్డినేటర్‌లు వెంకట్రాములు, తదితరులు పాల్గొన్నారు.

వర్ని : గ్రామపంచాయతీ కార్యదర్శులు సమ్మెలో భాగంగా నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కార్యదర్శులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని కోరారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతి..

తాడ్వాయి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లాలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కామారెడ్డి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం పక్కనే ఉన్న అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రమేష్ రావ్, నవాజ్ షరీఫ్, వీరేష్, స్రవంతి, ప్రవీణ్, నవీన్, పరమేశ్వరి, సాహితి, సౌందర్య తదితరులు ఉన్నారు.

కండ్లకు గంతలు కట్టుకుని నిరసన

నందిపేట్ : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నిరవధిక సమ్మెలో భాగంగా కండ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. అలాగే సమ్మెప్రాంతంలోనే సామూహిక పంక్తి భోజనాలు చేసి నిరసన తెలిపారు.



నందిపేట్‌లో కండ్లకు గంతలు కట్టుకుని నిరసన

తెలంగాణ సమగ్రశిక్షలో పనిచేస్తున్న వారిని రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-లింగంపేట్

గత కొన్ని సంవత్సరాలుగా తెలంగాణ సమగ్ర శిక్షణలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని తెలంగాణ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం నాయకులు సోమవారం డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ నూతన సచివాలయ ప్రారంభోత్సవం సందర్భంగా వివిధ శాఖల్లోని 5544 మంది కాంట్రాక్ట్ ఉద్యోగుల క్రమబద్ధీకరణను స్వాగతిస్తున్నామని వారన్నారు. కానీ ప్రభుత్వం కేవలం 5544 మందిని మాత్రమే పరిగణలోకి తీసుకుని మిగతా వేల మంది కాంట్రాక్టు ఉద్యోగుల జీవితాలను ప్రభుత్వం గాలికి వొదిలేసిందని వారు మండిపడ్డారు. తెలంగాణ సమగ్ర శిక్షాలో గత దశాబ్ద కాలంపైగా విధులు నిర్వహిస్తున్న 21000 మంది ఉద్యోగులను కూడా రెగ్యులర్ చేసి ఇచ్చిన మాటపై నిలబడాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో సత్యనారాయణ, విజయ్, సంజీవ్, సంఘగౌడ్, పడమటి రాజు, సీఆర్పీలు పాల్గొన్నారు.

బీరప్ప గుడి నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-తాడ్వాయి

కురమ సంఘం ఆధ్వర్యంలో బీరప్ప ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. మండలంలోని ఎర్రపహాడ్ గ్రామంలో కురమ సంఘం సభ్యులకు చెందిన కులదైవమైన బీరప్ప దేవాలయాన్ని నిర్మించేందుకు సోమవారం మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి దంపతుల చేతుల మీదుగా భూమిపూజ చేశారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ కపిల్ రెడ్డి, సర్పంచ్ బొక్క నర్సారె డ్డి,ఉప సర్పంచ్ బాలాజి,ఎంపిటీసి జలెందర్ రెడ్డి,విడిసి అధ్యక్షులు మోహన్ రెడ్డి గ్రామ పెద్దలు, కురమ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు అధైర్యపడొద్దు

ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

రైతులు అధైర్య పడవద్దని, పండించిన, తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఎంపీపీ నారెడ్డి దశరథ్ రెడ్డి రైతులకు భరోసా కల్పించారు. సోమవారం మండలంలోని రెడ్డిపేటలో ఆదివారం రాత్రి కురిసిన అకాల వర్షానికి, వరి కొనుగోలు కేంద్రంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు గర్గుల్ రాజాగౌడ్, ఉపసర్పంచ్ బాలయ్య, హైమద్, హనుమాన్లు, నర్సింలు, రాజు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎంపీప

17శాతం లోపు తేమ శాతం ఉన్న ధాన్యం కొనుగోలు చేస్తున్నాం

- ఆర్డీవో రాజేశ్వర్

నవతెలంగాణ-బోధన్

అకాల వర్షంతో తడిసి ఆరబెట్టిన ధాన్యం 17శాతం లోపు మాయిశ్చరైజ్ ఉంటే దానిని కొనుగోలు చేస్తున్నామని బోధన్ ఆర్డీవో రాజేశ్వర్ తెలిపారు. సోమవారం ఆయన బోధన్ మార్కెట్ కమిటీ యార్డులో రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు సత్వరమే జరిగేలా పలు శాఖల అధికారులను కేటాయించినట్టు తెలిపారు. రైతులు ధాన్యం తడవకుండా మరిన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మార్కెట్ కమిటీ ద్వారా, సొసైటీల ద్వారా రైతులకు ఉచితంగా టార్పాలిన్‌లు అందిస్తున్నారని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వరి కోతలు చేయనివారు మరికొన్ని రోజులు నిలిపివేయాలని సూచించారు. ఆయన వెంట ఏఎంసీ చైర్మన్ వీఆర్ దేశాయ్, వైస్ చైర్మన్ సాలూర షకీల్, నాయకులు బుద్దె రాజేశ్వర్ ఉన్నారు.

కాంగ్రెస్ ఎస్టీ సెల్ మండలాధ్యక్షునిగా గణేష్ నియామకం



నవతెలంగాణ-గాంధారి

గాంధారి ఎస్టీసెల్ మండల అధ్యక్షునిగా గణేష్ నియామకమైనట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. మండలంలోని గుల్లాడి తండాకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు గణేష్‌ను ఎస్టీసెల్ మండలాధ్యక్షునిగా గణేష్‌ను నియమించారు. ఈ సందర్భంగా గణేష్ మాట్లాడుతూ.. మండలంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు.

నవతెలంగాణ

నిజామాబాద్-కామారెడ్డి

4

మంగళవారం 02 మే 2023

బీఆర్ఎస్‌లోకి పలువురి చేరిక



బీఆర్ఎస్‌లో చేరిన పలువురు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

మండలంలోని పోచారం తండాలో సోమవారం కాంగ్రెస్, బీజేపీ పార్టీల నుంచి సుమారు 50 మందికి పైగా బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి జుక్కల్ శాసనసభ్యులు హన్మంత్ షిండే పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే హన్మంత్ షిండే, ఎంపీపీ ప్రతాపరెడ్డి, స్థానిక సర్పంచ్ మదన్‌రావు, సర్పంచ్ ఫోరం మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి, సొసైటీ చైర్మన్ హనుమంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఖండేరావు పటేల్, డాక్టర్ గంగాసింగ్, అశోక్, పడవాల్ డీపీచంద్, చందర్ సభలే, మాజీ ఎంపీటీసీ బాబులాల్ గ్రామస్తులు పాల్గొన్నారు

రైతులు అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

- ఎమ్మెల్యే హన్మంత్ షిండే
- పలు గ్రామాల్లో పంటల పరిశీలన

నవతెలంగాణ-పిట్లం/బిచ్కుంద/పెద్దకొడప్‌గల్

అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల రైతులు అధైర్య పడవద్దని నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం అందజేస్తామని ఎమ్మెల్యే హన్మంత్ షిండే అన్నారు. సోమవారం మండలంలోని గోద్మేగావ్, కారేగావ్, కంబాపూర్ గ్రామాల రైతుల పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వడగండ్ల వర్షాలకు దెబ్బతిన్న మొక్కజొన్న, జొన్న, వరి పంటలకు గాను నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం నష్టపరిహారం అందజేయనున్నట్టు వివరించారు. కల్లాల వద్ద ఆరబెట్టిన తడిసి ముద్దయిన మొలకెత్తిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రైతులు దిగులు చెందొద్దని ఆయన భరోసానిచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామ్మోహన్‌రావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.

బిచ్కుంద : గత వారం రోజుల నుంచి కురుస్తున్న అకాల వర్షాలకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని పంటలు నష్టపోయిన రైతులు అధైర్య పడవద్దని రైతులను ఆదుకుంటామని జుక్కల్ శాసనసభ్యులు, అసెంబ్లీ ప్యానెల్ స్పీకర్ హనుమంత్ షిండే అన్నారు. సోమవారం మండలంలోని వాజ్‌నగర్ గ్రామ శివారులో నష్టపోయిన పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలో రైతుబంధు, రైతుబీమా ప్రవేశపెట్టి వ్యవసాయానికి సరిపడా విద్యుత్‌ను సరఫరా చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనన్నారు. గత ప్రభుత్వాలు రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంబించారని పోడు భూములుగా ఏర్పడి చెరువులో కుంటలు చుక్క నీరు కూడా లేని రైతులకు పంటలు పండించుకోవడానికి నానా కష్టాలు పడాల్సి వచ్చిందని ఆయన ఆరోపించారు. కార్యక్రమంలో ఎంపీపీ అశోక్ పటేల్, ఎంపీటీసీ సాయిలు, పుల్కల్ సొసైటీ చైర్మన్ రామ్‌రెడ్డి, బారాస మండల అధ్యక్షులు వెంకటరావు దేశాయ్, బిచ్కుంద మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు బస్వరాజ్ పటేల్ రైతులు ఉన్నారు.



పిట్లంలో పంటలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే హన్మంత్‌షిండే, ప్రజాప్రతినిధులు

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే షిండే..

పెద్దకొడప్‌గల్ : మండల కేంద్రంలో జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్ షిండే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరి పంటను కొనుగోలు కేంద్రంలోనే అమ్మాలని దళారులను నమ్మి మోసపోవద్దని ఆయన అన్నారు. వరి తేమ 17 శాతం మించవద్దని, ఏ గ్రేడ్ రకం ధర రూ.2060, కామన్ ధర రూ.2040గా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, సర్పంచ్ తిర్మల్‌రెడ్డి, ఉప సర్పంచ్ విఠల్, సొసైటీ సీఈఓ సందీప్, తహసీల్దార్ దశరథ్ పలువురు పాల్గొన్నారు.

వ్యక్తిని కాపాడబోయి ఒకరు మృతి

నవతెలంగాణ-రాజంపేట్



సంగ్యా (ఫైల్)

మండలంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన ధరావత్ సంగ్యా (51) ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జింక నరసింహులు అనే వ్యక్తిని కాపాడబోయి ప్రమాదవశాత్తు చెరులో పడి మృతి చెందాడు. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపల్లి గ్రామానికి చెందిన జింక నరసింహులు 'నేను చనిపోతా అంటూ' శనివారం పరుగులు తీయగా ఆ గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు 'కాపాడండి కాపాడండి' అనడంతో ఎల్లారెడ్డిపల్లి తాండ గ్రామానికి చెందిన ధరావత్ సంగ్యా అతన్ని కాపాడదామని చెరువు కట్టపై బట్టలు తీసి చెరువులోకి దిగగా ప్రమాదవశాత్తు మృతి చెందాడు. గజ ఈతగాళ్లతో వెతికించగా ఎలాంటి ఆచూకీ దొరకలేదు. కాగా ఆదివారం శవం నీటిపై తేలిందని దీనిపై అతని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తడిసిన వరి ధాన్యం పరిశీలన, తరలింపు



ధాన్యం తరలింపు పరిశీలిస్తున్న అధికారులు, సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-రామారెడ్డి

అకాల వర్షాలకు కురుస్తున్న వర్షానికి, వరి కొనుగోలు కేంద్రాల్లో, తూకం వేసిన ధాన్యం, తడిసిపోవడంతో సోమవారం జిల్లా సహకార అధికారిని వసంత, సొసైటీ చైర్మన్ సదాశివారెడ్డి, పోసానిపేట్, కన్నాపూర్ తండాలో పరిశీలించారు. ఈ సందర్భంగా సదాశివరెడ్డి మాట్లాడుతూ.... రైస్ మిల్లర్లతో మాట్లాడి తూకం వేసి తడిసిన ధాన్యాన్ని రైస్ మిల్ కు తరలించామని తెలిపారు. అకాల వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులు వరికుప్పలపై తార్పాలిన్ కవర్లతో కప్పి ఉంచాలని, రైతులు అధైర్య పడవద్దని, ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో సీఈఓ బైరయ్య, సిబ్బంది నవీన్, రైతులు తదితరులు ఉన్నారు.

పైప్‌లైన్ మరమ్మతులు చేయిస్తాం : ఎమ్మెల్యే



ఎమ్మెల్యేను కలిసిన ముషీర్‌నగర్ గ్రామస్తులు

నవతెలంగాణ-సిరికొండ

రూరల్ ఎమ్మెల్యే తెలంగాణ ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్‌కు రుణపడి ఉంటామని సిరికొండ మండలం ముషీర్‌నగర్ గ్రామస్తులు తెలిపారు. సోమవారం తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్‌ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ముషీర్ నగర్ గ్రామంలోని పల్లె చెరువు రిజర్వాయర్, తుమ్ రిపేర్, ఫీడర్ ఛానల్, కాలువ పైప్ లైన్ మరమ్మత్తులు చేయించాలని ఎమ్మెల్యేని కోరారు. 20 రోజులలో పైప్ లైన్ పనులను పూర్తి చేయిస్తానని, మరమ్మత్తులు చేస్తానని ఎమ్మెల్యే హామీనిచ్చారని గ్రామస్తులు తెలిపారు. ఈ చెరువు కింద సుమారు 500 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో లస్కర్, నౌసిలాల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 49 ఫిర్యాదులు



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 49 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఓ చందర్, జెడ్పి సీఈఓ గోవింద్, నిజామాబాద్ ఆర్డీఓ రవిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్లమ్మగుట్ట స్వాగత తోరణాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆర్‌యుబి రైల్వే కమాన్ వద్ద ఎల్లమ్మగుట్ట స్వాగత తోరణాన్ని సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్, సుడా చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్ న్యాలం రాజు, ఏజిపి యెండల ప్రదీప్, యెండల ప్రసాద్, కార్పొరేటర్లు పాల్గొన్నారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల దుబ్బా స్మశానవాటిక పనులను పరిశీలించారు. కాంట్రాక్టర్లు అధికారులు పనులలో నిర్లక్ష్యం వహించద్దన్నారు. పనులలో నాణ్యత పాటించాలని సూచించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

నవతెలంగాణ-మాక్లూర్

మండల పరిషత్ కార్యాలయంలో కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను జెడ్పీ చైర్మన్ దాదాన్నగారి విఠల్ రావు, ఎంపిపి మాస్త ప్రభాకర్ లబ్ధిదారులకు చెక్కులను సోమవారం అందజేశారు. 143 కల్యాణలక్ష్మి, 46 షాదీముబారక్ లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శంకర్, ఎంపీవో శ్రీనివాస్, కో -ఆప్షన్ హైమ్మద్, సర్పంచులు, ఎంపీటీసీలు, కార్పొరేటర్ రాయ్ సింగ్, బారాస నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

నూతన బోరు ప్రారంభం

నవతెలంగాణ-సిరికొండ

లొంక రామలింగేశ్వర స్వామి ఉప దేవాలయంలో ఆలయ కమిటీ సభ్యుల విన్నపం మేరకు సిరికొండ గ్రామానికి చెందిన బోర్ వెల్ యజమాని రాజుల గంగాధర్ సోమవారం ఏకాదశి ని పురస్కరించుకుని ఉచితంగా తన సొంత డబ్బులతో ఆలయంలో బోర్ వేయించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు రాజుల గంగాధర్ ను సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ యెన్నం రాజారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు అవధూత గంగాధర్ ,కోల భూపతి రాజ్, పారిపెల్లి రాజ్ కుమార్, బాడాల సంతోష్, చింతకింది గంగాధాస్, గ్యామ సురేష్, కనగందుల లక్ష్మీనారాయణ, కనగందుల సతీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కంటి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీపీ బాదవత్ రమేష్ నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమం ఇందల్ వాయి ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలోని డిచ్‌పల్లి మండలంలోని సాంపల్లి, ఇందల్ వాయి మండలంలోని చంద్రాయాన్ పల్లి గ్రామలలో ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్, సర్పంచ్లు మోహన్ రెడ్డి, లలిత గంగాదస్, ఎంపిడిఓ రాములు నాయక్ వైద్య సిబ్బంది తో కలిసి సోమవారం ప్రారంభించారు. 18 సంవత్సరాల పై బడిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్ష నిర్వహించడం జరిగిందని, ఆశా కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కంటి సమస్యలతో బాధపడుతున్న వారిని గుర్తించి కంటి పరీక్ష ఉచిత శిబిరానికి రప్పించారని తెలిపారు. మోతే బిందు శస్త్ర చికిత్సకు జిల్లా ప్రధాన ఆసుపత్రికి పలువురిని రిఫర్ చేయడం జరుగుతుందని వైద్య సిబ్బంది తెలిపారు. ఈ సందర్భంగా ఎంపిపి బాదవత్ రమేష్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల ఆరోగ్య రక్షణ కోసం కృషిచేస్తుందని, ఉచిత కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెడికల్ క్యాంపు అధికారిణి మాధవి, అప్తోమెలసి అర్ సోని, డిఇఓ శిరిష, కార్యక్రమంలో ఉప సర్పంచ్ ప్రకాష్, అరటి రఘు, తదితరులు పాల్గొన్నారు.



కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

కొనసాగుతున్న జేపీఎస్‌ల సమ్మె



ముప్కాల్‌లో నినాదాలు చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

నవతెలంగాణ-మోపాల్/మాక్లూర్/ముప్కాల్

మోపాల్ మండల కేంద్రంలో మండలంలోని కార్యదర్శులు కళ్లకుగంతలతో నిరసన తెలిపారు.

కార్యదర్శి నవీన్ మాట్లాడుతూ ఇప్పటికైనా ప్రభుత్వం 9వేల మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని పంచాయతీశాఖ మంత్రికి, ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. రెగ్యులర్ చేసేవరకు నిరసనను కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో రాజు, ధీరజ్, మదుల, హరీష్ మోహన్ చైతన్య వెంకట్, శ్యామ్, నర్సింలు, సునీత, పద్మజ, సంధ్య తదితరులు పాల్గొన్నారు

మాక్లూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ముందు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కళ్లకు గంతలు కటుకుని నిరసన చేపట్టారు. జూనియర్ పంచాయితీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని, పే స్కేల్ అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా కమిటీ అడ్వైజర్ మోహన్, నాగేంద్ర, ఇసి మెంబర్ రాజేష్, మండల అధ్యక్షులు మహేష్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ముప్కాల్ : ముప్కాల్ మండల పరిషత్ కార్యాలయం ఎదుట బాల్కొండ ఉమ్మడి జూనియర్ సెక్రటరీలు సమ్మె నాలుగో రోజుకు చేరుకుంది. తమ ఉద్యోగాలు క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శిలు భరత్ స్వరూప్, శంకర్, వనజ, గౌతమి, రాజ్యలక్ష్మి వనిత, రవి, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు..

మోడీ పాలనలో ప్రజా, కార్మిక సంక్షేమం గాలికి

- ప్రజాపోరాటాలతో రాజ్యాంగాన్ని కాపాడుతాం - సీపీఐ నేత పద్మ

నవతెలంగాణ-నిజామాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ప్రధానమంత్రి మోడీ తన మన్ కీ బాత్‌లో ప్రజా, కార్మిక సంక్షేమం పూర్తిగా గాలికొదిలారని, కొద్దిమంది పెట్టుబడిదారుల కోసమే మోడీపాలన సాగుతోందని మరోసారి రుజువైందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పశ్య పద్మ ఆరోపించారు. మోడీ తన మన్ కీ బాత్ లో కార్మికుల సమస్యల గురించి ప్రస్తావించకపోవడంపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక గంజ్ ఆవరణలో బిజెపి హటావో - దేశ్ కో బచావో నినాదంతో జరిగిన బహిరంగ సభలో ముఖ్యఅతిథిగా హాజరై పద్మ ప్రసంగించారు. యూరప్ దేశాల్లో కార్మికులకు పనిగంటలు తగ్గుతూ ఉంటే భారతదేశంలో మోడీ ప్రభుత్వం పెంచుతోందని అన్నారు. అందులో భాగంగానే కర్ణాటక రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వం 12 గంటల పని గంటలు పెంచిందని వెల్లడించారు. 1921 లో బ్రిటిష్ ఇండియా ప్రభుత్వం 8 గంటల పని విధానం అమలు చేస్తే మోడీ ప్రభుత్వం అందుకు భిన్నంగా పని గంటలు పెంచుతూ కార్మిక లోకాన్ని అస్థిరత్వం చేస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. అనేక కార్మిక ఉద్యమాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం హరించివేసి నాలుగు కోడ్స్ అమల్లోకి తెచ్చిందని ఆమె పేర్కొన్నారు. గత ప్రభుత్వాల కంటే బిజెపి ప్రభుత్వం పనికి తగ్గ వేతనం కూడా అమలు చేయడం అని ఆరోపించారు. చికాగో మేడే పోరాట స్ఫూర్తి, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు రైతు చట్టాలు వ్యతిరేకంగా సాగిన రైతు ఉద్యమ స్ఫూర్తితో నాలుగు కోడ్స్ వెనక్కి తీసుకునే వరకు కార్మికోద్యమం ఏఐటియుసి చేపడుతుందని స్పష్టం చేశారు. కుల, మతాలతో విడదీసి పాలిస్తున్న బిజెపిని 2024 ఎన్నికల్లో ఓడించి తీరుతామని వెల్లడించారు.



ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కార్మికుల ప్రదర్శన

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ మాట్లాడుతూ.. తొమ్మిదేళ్ల కాలంలో సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి రోజురోజుకు నిరుద్యోగం పెరుగుతున్నా పట్టించుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్ లు దేశంలో అల్లర్లు లేపుతూ ఎన్నికల హామీలను ప్రజలు మర్చిపోయే విధంగా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బహిరంగ సభకు సిపిఐ నిజామాబాద్ అర్బన్ నిజామాబాద్ అర్బన్ కార్యదర్శి వై ఓమయ్య అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కంజర భూమయ్య, జిల్లా కార్యదర్శి పి. సుధాకర్, తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం రాష్ట్ర నాయకులు గడ్డం మురళి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు నరసింగరావు తదితరులు పాల్గొన్నారు. అంతక ముందు నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి ముందు ఏఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి యూసుఫ్ ఏఐటీయూసీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అక్కడ నుండి ర్యాలీగా గాంధీ చౌక్, కిషన్ గంజ్ శ్రద్ధానంద్ గంజ్ వరకు ర్యాలీ నిర్వహించారు.

మేడే సందర్భంగా ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో ప్రదర్శన

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మేడే సందర్భంగా భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐ ఎఫ్ టి యు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రాజీవ్ గాంధీ ఆడిటోరియం నుండి మున్సిపల్ కార్యాలయం (ధర్నాచౌక్) వరకు కార్మిక ప్రదర్శన చేసి మున్సిపల్ కార్యాలయం వద్ద మేడే జెండాను ఆవిష్కరించి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు వనమాల కృష్ణ మాట్లాడుతూ... మోడీ ప్రభుత్వం కార్పోరేట్ పాలన సాగిస్తుందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు పెరుగుతూ చాలీచాలని జీతాలతో కార్మిక రంగం అనేక అవస్థలు పడుతుందన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు సమాన పనికి, సమాన వేతనం ఇప్పటికీ అమలు కావడం లేదన్నారు. నిజ జీవితాలకు సరిపడా కనీస వేతనాలు, సామాజిక భద్రత, పని గంటల తగ్గింపుకై పోరాడుదామన్నారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టి యు జిల్లా ఉపాధ్యక్షులు ఎం. వెంకన్న, జిల్లా నాయకులు కిరణ్, విటల్, ఈశ్వరి, లక్ష్మి, సాయరెడ్డి, పి.డి.ఎస్.యు జిల్లా ప్రధాన కార్యదర్శి కే.గణేష్ నగర అధ్యక్షులు అషూర్ ఏఐపీకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి సాయగౌడ్ ఇఫ్టూ అనుబంధ సం ఘాల నాయకులు రాజే శ్వర్, శివకుమార్, గోవర్ధన్, రజిని, కళావతి, లక్ష్మీ, గంగాధర్, తది తరులు పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న సీపీఐ నాయకులు



మున్సిపల్ కార్యాలయం ఎదుట జెండా ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్మికులు

వైభవంగా శివనామ సప్తా

నవతెలంగాణ-బోధన్

సాలూర మండల కేంద్రంలోని రాచన్న మందిరం వద్ద వీర శైవ లింగాయత్ సమాజ్ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో 4వ అఖండ శివనామ సప్తాహం ముగింపు కార్యక్రమం సోమవారం వైభవంగా కొనసాగింది. గత నెల ఏప్రిల్ 24న సప్తాహ వేడుకలు ప్రారంభం కాగా సోమవారం ముగిసాయి. ఏడు రోజుల పాటు పరమ రహస్య గ్రంథ పారాయణం, శివ కీర్తన, భజనలు, మంగళహారతి, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ముగింపు సందర్భంగా బోధన్ ఏసీపీ కిరణ్ కుమార్, ఏఎంసీ చైర్మెన్ వీఆర్ దేశాయ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత దేశాయ్, రూరల్ సీఐ శ్రీనివాసరాజు, తహసీల్దార్ మమత, సర్పంచ్ భుయ్యాన్ చంద్రకళ, ఎంపీటీసీ కండెల సవిత, సొసైటీ ఛైర్మెన్ అల్లే జనార్ధన్, ఐడీసీఎంఎస్ డైరెక్టర్ రాజాగౌడ్, ఎంఆర్ఐ గంగాధర్ హాజరవడంతో వారిని కమిటి ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సొసైటీ సీఈవో బస్వంత్ రావు, వీరశైవ లింగాయత్ సమాజ్ గ్రామ అధ్యక్షుడు శివపూజ శంకర్, ప్రతినిధులు జయరాం, కాసిరెల్లి హనుమంతు, రాజుపటేల్, గంటే శంకర్, కౌరే సంగ్రామ్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష

నవతెలంగాణ-భిక్కనూర్

మద్యం సేవించి వాహనం నడిపిన కేసులో ఒకరికి జైలు శిక్ష విధించినట్టు ఎస్ఐ ఆనంద్ గౌడ్ తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన రాజేశ్వర్ మద్యం సేవించి వాహనం నడుపుతుండడంతో పోలీసుల తనిఖీలలో పట్టుబడగా కేసు నమోదు చేసి సోమవారం కోర్టులో హాజరు పరచగా రెండవ మెజిస్ట్రేట్ ప్రతాప్ రెండు రోజుల జైలు శిక్షతోపాటు 200 జరిమానా విధించినట్లు ఎస్సై తెలిపారు.

కల్లాల వద్దే ధాన్యానికి మొలకలు

- నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు ఇవ్వాలి



మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు, నాయకులు

నవతెలంగాణ-లింగంపేట్

కల్లాల వద్దే ధాన్యానికి మొలకలు వస్తున్నాయని, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేలు పరిహారం ఇవ్వాలని తెలంగాణ జన సమితి ఎల్లారెడ్డి నియోజకవర్గ ఇన్చార్జ్ డాక్టర్ నిజ్జన రమేష్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎల్లారెడ్డి నియోజకవర్గ పరిధిలోని లింగంపేట్ మండలంలోని భవానీపేట్, ముంబోజీపేట్, కొండాపూర్, రామ్‌పూర్, జల్దిపల్లి గ్రామాల్లో వరి ధాన్యం కళ్లాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అధికారులు గ్రామాలలో పర్యటించి పంట నష్టపోయిన రైతులను గుర్తించి సర్వే నిర్వహించి 50 వేల రూపాయలు ఎకరాకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు కేసీఆర్ ప్రభుత్వం భరోసా కల్పించడం లేదని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జన సమితి పార్టీ జిల్లా నాయకులు పూల్ సింగ్ నాయక్, గోపాల్, రైతులు సాయిలు, వెంకటేశ్, రాములు గంగారాం, సంగయ్య పాల్గొన్నారు.

ఘనంగా గంగమ్మ తల్లి ఊరేగింపు

నవతెలంగాణ-సిరికొండ

మండల కేంద్రంలోని ఎల్లం చెరువు వద్ద నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ తల్లి ఆలయ ఉత్సవాలు సోమవారం ప్రారంభించారు. ముందుగా గంగమ్మ తల్లి మూలవిరాట్‌ను మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. బుధవారం విగ్రహ ప్రతిష్టాపన జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎన్నం రాజారెడ్డి, గంగపుత్ర కమిటీ సభ్యులు ప్రవీణ్, లక్ష్మణ్, సతీష్, సుధాకర్, హేమంత్, గంగారం, ముఠామేస్త్రి, గంగపుత్రులు తదితరులు పాల్గొన్నారు.

పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలి

నవతెలంగాణ-సిరికొండ

ఆదివారం కురిసిన భారీ వడగండ్ల వర్షానికి మండలంలోని రావుట్ల గ్రామంలో 30 శాతం పంట నష్టం జరిగిందని, పంటనష్టపరిహారం చెల్లించాలని ఏఐకెఎంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.భాస్కర్ డిమాండ్ చేశారు. నష్టపోయిన పంట పొలాలను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పంట నష్ట పరిహారం రూ.50వేలు వెంటనే అందించాలని డిమాండ్ చేశారు. ఈయన వెంట సర్పంచ్ తోట భుదేవ్వ రాజారెడ్డి, జిల్లా అధ్యక్షులు బాకారం గంగారెడ్డి, శివయ్య, గొర్రె రమేష్, కే.నారాయణ, రాజన్న, బాలకిషన్, భూమన్న, ఏఈవో ఉన్నారు.

కండ్లకు గంతలతో జేపీఎస్‌ల నిరసన

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు జూనియర్ పంచాయతీ కార్యదర్శులు కళ్లక గంతలు కట్టుకుని నిరసన తెలియజేశారు. మండలంలో నాలుగో రోజు సమ్మె కొనసాగింది. వీరి న్యాయమైన కోరికలు తీర్చాలని మండలంలోని చందమియబాగు గ్రామపంచాయతీ సర్పంచ్ కిషన్ నాయక్ మద్దతు తెలిపారు.



కండ్లకు గంతలతో నిరసన

బీఆర్ఎస్ పార్టీ సైనికులు ప్రజల్లో ఉండండి

- అభివద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో చర్చ జరపండి
- ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త

నవతెలంగాణ-కంఠేశ్వర్

బీఆర్ఎస్ పార్టీ సైనికులు ప్రజల్లో ఉండాలని, అభివద్ధి సంక్షేమ పథకాలపై ప్రజల్లో చర్చ జరపాలని ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్త అన్నారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల కంఠేశ్వర్ న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీ కమ్యూనిటీ హల్ లో 19,20,41, 42 డివిజన్ల బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆత్మీయ సమ్మేళనలతో కార్యకర్తల మధ్య అనుబంధాన్ని పెంచుతున్నాయి.ప్రజలను జాగత పరిచేందుకు వేదిక గా ఆత్మీయ సమ్మేళనలు నిలుస్తున్నాయని అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సంక్షేమ రంగానికి పెద్ద పీట. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణలో జరుగుతున్న అభివద్ధి సంక్షేమ -పథకాలను దేశ ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. బీఆర్ఎస్ సర్కార్ రావాలని దేశ ప్రజలు ఆకాంక్షిస్తున్నారని అన్నారు.

స్థానిక యువతకి ఉపాధి కల్పించేందుకు ఐటీ హాబ్‌ని నిర్మిస్తున్నామని తెలిపారు. నిజామాబాద్ నగరంలో జరుగుతున్న ప్రతి అభివద్ధి -సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత గులాబీ సైనికులు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్ ,నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి, మాజీ మేయర్ ఆకుల సుజాత, బి ఆర్ ఎస్ పార్టీ నగర అధ్యక్షులు సిర్ప రాజు, సీనియర్ నాయకులు సుజిత్ సింగ్ ఠాకూర్, సత్య ప్రకాష్ 19వ డివిజన్ మాజీ కార్పొరేటర్ పొద్దుటూరి లావణ్య జగత్ రెడ్డి, 20వ డివిజన్ ఇంచార్జ్ నాయిని సుజన్, యెండల ప్రసాద్, 41 డివిజన్ మాజీ కార్పొరేటర్ చాంగు భాయి, 42 వ డివిజన్ మాజీ కార్పొరేటర్ తేజస్విని, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.



సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలోని అర్హత కల్గిన నిరుద్యోగ ఎస్సీ, ఎస్టీ బీసీ (మైనారిటీలతో సహా) అభ్యర్థులకు నాందేవ్‌వాడ (ఎస్సీ బాలుర హాస్టల్), తెలంగాణా స్టేట్ స్టడీ సర్కిల్ (టి ఎస్ఎస్‌సి నిజామాబాద్), నిజామాబాద్ నందు ఐదు నెలల పాటు రాష్ట్ర ఉద్యోగ ఆర్ఆర్‌బి. బ్యాంకింగ్, యస్‌యస్‌సి అర్హత పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ శిబిరంలో చేరడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డా. విజయ కుమార్, హానరరి డైరెక్టర్ టియస్‌యస్‌సి నిజామాబాదు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల28 నుండి ప్రారంభమైందని ఆన్‌లైన్ దరఖాస్తులను www.tsstudycircle.co.in వెబ్ సైట్ ద్వారా ఈనెల 14 లోపు రిజిస్టర్ చేసుకోవాలని పేర్కొన్నారు. ఈనెల 21న నిజామాబాద్‌లో ప్రవేశ పరీక్ష జరుగుతుందని, పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా 100 మంది అభ్యర్ధులు ఎంపిక చేస్తామని తెలిపారు. వివరాలకు ఫోన్ నెంబర్ కు 9491468799, 9951199460 సంప్రదించాలని పేర్కొన్నారు.

3న లక్కీడ్రా

నవతెలంగాణ-కంఠేశ్వర్

2023-2024 విద్యా సంవత్సరంనకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (బేగంపేట్, రామంతపూర్) నందు 1వ తరగతి ఇంగ్లీషు మీడియంలో ప్రవేశానికి షెడ్యూల్డ్ తెగల వారు (ఎస్టి) (3) బాలురు, (3) బాలికలకు మొత్తం ఆరు సీట్లకు గాను దరఖాస్తులు స్వీకరించినట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ దరఖాస్తుల లక్కీ డ్రా ఈనెల 3 ఐడిఓసి, నిజామాబాద్ నందు కలెక్టర్ ఆధ్వర్యంలో తీస్తారని నిజామాబాద్ గిరిజన అభివద్ధి శాఖ అధికారి నాగోరావు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తుదారులు హాజరుకవాలని తెలిపారు.

మున్సిపల్ కార్మికులకు సన్మానం

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంతర్జాతీయ 137వ కార్మిక దినోత్సవం సందర్భంగా ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షులు మల్లమరి సుధాకర్ మున్సిపల్ కార్మికులను ఘనంగా సన్మానించారు. సోమవారం నగరంలోని ఆర్ అండ్ బి అతిథి గహంలో ఎమ్మార్పీఎస్ నగర అధ్యక్షులు సుధాకర్ ఆధ్వర్యంలో 30మంది మున్సిపల్ కార్మికులకు శాలువాకప్పి సన్మానించారు.

వైఎస్ఆర్‌టీపీకి రాజీనామా

నవతెలంగాణ-కంఠేశ్వర్

గత రెండు సంవత్సరాలుగా వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ నిజామాబాద్ జిల్లా అధ్యక్షునిగా, నిజామాబాద్ అర్బన్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జ్‌గా, నిజామాబాద్ పార్లమెంటు నియోజకవర్గ కో కన్వీనర్ గా వివిధ బాధ్యతల్లో క్రియాశీలంగా పనిచేసిన బుస్సాపూర్ శంకర్ వైయస్సార్ తెలంగాణ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, పార్టీ పదవులకు రాజీనామా సోమవారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వైయస్సార్ పై వైయస్ షర్మిలపై ఉన్న అభిమానం ఉన్నప్పటికీ అనివార్య కారణాల వల్ల రాజీనామా చేశానన్నారు. బుస్సాపూర్ శంకర్‌తోపాటు పలువిభాగాల జిల్లా, మండల అధ్యక్షులు, కార్యదర్శులు, తదితరులు రాజీనామా చేశారు.

పాముల బస్తి మాల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా బత్తుల కిష్టయ్య

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

పాముల బస్తి మాల సంక్షేమ సంఘం అధ్యక్షులుగా బత్తుల కిష్టయ్యను ఎన్నుకున్నారు. సెక్రెటరీగా బండి బాలకష్ణ, కోశాధికారి కొప్పు చంద్రశేఖర్ ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ సంఘం అధ్యక్షుడిగా గెలిపించినందుకు సంఘం సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. సంఘం అభివృద్ధికి పాటుపడతానని, సభ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు.

మగ్గిడి పాఠశాలలో వేసవి క్రీడా శిక్షణ కేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట్ర క్రీడాధికార సంస్థ, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ వెల్ఫేర్ వారి ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని మగ్గిడి పాఠశాలలో వేసవి క్రీడా శిక్షణ శిబిరాన్ని ఉప సర్పంచ్ నర్సయ్య, విడిసి సభ్యులు మోహన్ రెడ్డి, ఆదర్శ యూత్ సభ్యులు చిన్నారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సుమలత నర్సయ్య మాట్లాడుతూ వేసవి శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని జాతీయ రాష్ట్ర స్థాయిలో ఉత్తమ ప్రదర్శన ఇచ్చే విధంగా తర్ఫీదు పొందాలని కోరారు. వ్యాయామ ఉపాధ్యాయులు మధు మాట్లాడుతూ మే 1 నుండి 31 వరకు శిక్షణ శిబిరం కొనసాగుతున్నదని తెలిపారు.

గల్ఫ్‌కార్మికుడి కుటుంబానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-మోపాల్

మండలంలోని కంజర్‌కు చెందిన శేక్ జావేద్ దుబాయిలో ఆత్మహత్య చేసుకోగా 13 సంవత్సరాలుగా యూఏఈ లో గల్ఫ్ బిడ్డల సంక్షేమం కోసం ఏన్నో సేవ కార్యక్రమాలు చేస్తున్న ఎమిరేట్స్ తెలంగాణ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ రూ.54,500 చెక్కును ఈటిసిఏ చారిటీ కో-అర్డినేటర్ శేక్ అహ్మద్ శాదుల్లా మృతునికి కుటుంబానికి సోమవారం ఆర్థిక సహాయం అందించారు. జావేద్ కు భార్య ఇద్దరు అడపిడ్డలు ఉన్నారని, వారి ఖర్చుల నిమిత్తం ఇటిసిఏ సభ్యుల సహకారం తో డబ్బులను సమకూర్చి ఆర్థికంగా సహాయం చేసామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ క్యాసాల భరత్, యంపిటిసి రామర్తి శ్రావణ్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామపంచాయతీ భవనానికి భూమిపూజ

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని సర్పంచ్ తాండ గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి సోమవారం గ్రామ సర్పంచ్ సరియా నాయక్ భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి, నిధుల మంజూరుకు కషి చేసిన తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ శాసనసభ్యులు బాజిరెడ్డి గోవర్ధన్, ధర్పల్లి జెడ్పిటిసి సభ్యుడు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ సంఘం ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్ లకు ప్రత్యేక కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు రమేష్, ఎంపిటిసి బులిచందర్, ఉప సర్పంచ్ సురేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు శివ ,గ్రామ అభివద్ధి కమిటీ చైర్మన్ రామ్‌చందర్, సెక్రటరీ ,కారోబార్, వార్డ్ మెంబర్లు నాయకులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల హక్కులను కాపాడుకుందాం

- టీడబ్ల్యుజేఎఫ్ జిల్లా అధ్యక్షకార్యదర్శులు భాస్కర్, రాంచదర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

మే డే స్ఫూర్తితో జర్నలిస్ట్ హక్కులను కాపాడుకుంటామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యుజేఎఫ్) జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భాస్కర్, రాంచందర్ చెప్పారు. మే డే సందర్భంగా ఫెడరేషన్ కార్యాలయం వద్ద కార్యదర్శి రాంచందర్ ఫెడరేషన్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీడియాపై, జర్నలిస్టులపై ఆంక్షలు విధిస్తూ హక్కులు కాలరాస్తున్నాయని విమర్శించారు. మీడియా కార్పొరేట్ యజమానుల చేతిలోకి వెళ్లిన తరువాత జర్నలిస్టుల హక్కుల గురించి పాలక ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని వాపోయారు. పోరాడి సాధించుకున్న తెలంగాణలోనూ జర్నలిస్టులకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు దక్కడం లేదని అన్నారు. జిల్లాలో ఇండ్ల స్థలాల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాలు అమలు కావడం లేదని, ఉద్యోగ భద్రత లేదని వాపోయారు. జర్నలిస్టులు వత్తి ధర్మం నిర్వహిస్తూనే హక్కుల కోసం ఉద్యమిం చాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యలపై కూడా పని చేయాల్సిన బాధ్యత జర్నలిస్టులపై ఉందన్నారు. జర్నలిస్టులు తమ హక్కుల సాధనకు, సక్షేమ చట్టాల అమలు కోసం ఉద్యమించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె. వెంకటేష్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కుంచం వెంకటేష్, రాష్ట్ర కమిటీ సభ్యులు అనిత, పరమేష్, జిల్లా నాయకులు రాకేష్, మధు, రాజు, కృష్ణ, ప్రవీణ్, గోపి, నవీన్ పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న జర్నలిస్టులు

జీజీహెచ్‌లో కార్మిక దినోత్సవం



కార్మికులకు ప్రశంసాపత్రం అందజేత

నవతెలంగాణ-కంఠేశ్వర్

అంతర్జాతీయ కార్మిక దినోత్సవం నిజామాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో సోమవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ చైర్మన్ నిజామాబాద్ దాదన్నగారి విట్టల్ , నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కిరణ్ కుమార్ ప్రిన్సిపల్ గవర్నమెంట్ మెడికల్ కాలేజ్ డాక్టర్ పి ఇందిరా ముఖ్య అతిథులుగా విచేశారు. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విటల్, నిజామాబాద్ నగర మేయర్ దండు నీతి కిరణ్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో శానిటేషన్ సెక్యూరిటీ సిబ్బంది సేవలు మరువలేనివని అన్నారు. డాక్టర్ ప్రతిమ రాజ్ మాట్లాడుతూ.. ఆసుపత్రిలో కార్మికుల సేవలు, పేషంట్ కేర్ సిబ్బంది సేవలతో ఆసుపత్రి అభివద్ధికి తోడ్పడుతున్నారని అభినందించారు. మేడే సందర్భంగా కార్మికుల ఆరోగ్య భద్రత దష్టిలో ఉంచుకుని అందరికీ అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. 40 సంవత్సరాలు పైబడిన మహిళలకు మమ్మొగ్రఫ్ పరీక్ష నిర్వహించామని, వారి సేవలను గుర్తించి వారిలో కొందరికి ప్రశంస పత్రాలను, బహుమతులను అందజేయడం జరిగిందని తెలిపారు. తమ విధిని సక్రమంగా నిర్వర్తించిన వెంకట్ ,పేషంట్ కేర్ సిబ్బందికి తగిన నగదు పారితోషికం ఇచ్చి సత్కరించారు. కార్మిక సంఘం అధ్యక్షులు ఓమయ్య మాట్లాడుతూ అంతర్జాతీయ కార్మిక దినోత్సవం అధికారంగా నిర్వహించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సుధాకర్, ఆసుపత్రి శానిటేషన్ సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ ఇంటి నెంబర్ల కేటాయింపుపై కలెక్టర్‌కు ఫిర్యాదు

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపాలిటీ పరిధిలో అక్రమంగా ఇంటి నంబర్ల కేటాయింపు, ఇరిగేషన్, ప్రభుత్వ భూముల కబ్జా గురించి పట్టణ కాంగ్రెస్ నాయకులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా నాయకులు కోలా వెంకటేష్ మాట్లాడుతూ.. ఆర్మూర్ మున్సిపాలిటీ పరిధిలో ప్రభుత్వ అసైన్ భూములకు, కోర్టు వివాదాల్లో ఉన్న భూములకు ఇరిగేషన్ భూమిలో అక్రమంగా కడుతున్న నిర్మాణాలకు అక్రమంగా ఇంటి నంబర్లు కేటాయిస్తున్న మున్సిపల్ అధికారులపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా స్థాయి అధికారితో కమిటీ వేసి మూడు సంవత్సరాలుగా ఇచ్చిన ఇంటి నంబర్లను విచారణ చేసి అక్రమంగా కేటాయించిన ఇంటి నంబర్లను రద్దు చేయాలని అక్రమాలకు పాల్పడ్డ సంబంధించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. ఇరిగేశన్ భూములు కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్న కట్టడాలను వెంటనే కూల్చివేసేల అధికారులను ఆదేశించాలని కోరారు. నిరూపయోగంగా ఉన్న రైతు బజారు, ఇండోర్ స్టేడియం లను ప్రారంభించి లబ్ధిదారులకు కేటాయించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మందుల పోశెట్టి, మీసాల రవి, హబీబ్, బాల కిషన్, సుద్దపల్లి అఖిల్, దినేష్, పెద్ద పోశెట్టి, పాషా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డులు అందజేత



కార్మికులకు లేబర్ కార్డులు అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్

మేడే సందర్భంగా కార్మిక శాఖా ఆధ్వర్యంలో పట్టణములోని వడ్డెర కాలనీలో సోమవారం ఘనంగా మేడే ఆత్మీయ సంబరాలు జరిగాయి. భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డులను అందజేశారు. మండల కార్మిక శాఖ అధికారి మనోహర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ మహిళా న్యాయవాది, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ మెంబర్, మున్సిపల్ కౌన్సిలర్, బార్ అసోసియేషన్ మాజీ ఉపాధ్యక్షులు సంగీతా ఖాందేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సంగీతా ఖాందేష్ చేతుల మీదుగా భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డులను అందచేశారు. కార్యక్రమములో కార్మిక శాఖ అధికారి మనోహర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ బి ఆర్ఎస్ నాయకులు ఖాందేష్ సత్యం, మక్కల సాయి నాథ్, బండారి నరేశ్, వెంకటి, రాజారామ్, ఎల్లయ్య మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కురుస్తున్న వర్షం.. తడుస్తున్న ధాన్యం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఈదురు గాలులతో కూడిన అకాల వర్షాలు అన్నదాతను అతులకుతులం చేస్తూనే ఉన్నాయి. ఆదివారం అర్ధరాత్రి కురిసిన భారీ వర్షానికి మండల కేంద్రంలో సుమారు 100 క్వింటాళ్ల వడ్లు వర్షంతో తడిసిపోయాయి. ప్రతిరోజు వర్షం కురిసి ధాన్యం తడవడంతో ఆరబోసేందుకు అన్నదాత కష్టాలు పడుతున్నారు. ధాన్యం ఆరే లోపు మళ్లీ వర్షంకురుస్తోంది. కొయ్యని పంట చేతికి వస్తుందో లేదో తెలియని పరిస్థితి నెలకొంది. పెట్టుబడి కూడా వస్తుందో రాదోనని అన్నదాత ఆందోళన చెందుతున్నాడు.



కమ్మర్‌పల్లిలో తడిచిన ధాన్యం ఎత్తుతున్న రైతులు



ఆర్మూర్ : గోవింద్‌పేట్‌లో పంట నష్టం పరిశీలన

గోవింద్‌పేట్‌లో పంటల పరిశీలన

ఆర్మూర్ : మండలంలోని గోవింద్‌పేట్ గ్రామంలో సోమవారం మండల వ్యవసాయ అధికారి హరికష్ణ అకాల వర్షాలతో నష్టపోయిన నువ్వు, కూరగాయల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట నష్టం వివరాలను ప్రభుత్వానికి పంపుతామని, వర్షాలు ఉన్నందున వరికుప్పలను తాటి పత్రాలతో కప్పి ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బండమీది జమున గంగాధర్, ఎంపీటీసీ యల్ల రాజ్ కుమార్, పి ఏ సి ఎస్ సొసైటీ చైర్మన్ బంటు మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కడ్తా లేకుండా కొనాలి

మెండోర : నష్టపోయిన పంటలకు ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కడతా లేకుండా కొనుగోలు చేయాలని సునీల్ యువసేన సభ్యులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వర్షాలకు తడిసిన ధాన్యాన్ని రైతుల సమక్షంలో సునీల్ యువసేన సభ్యులు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న వరి , మొక్కజొన్న , నువ్వు ఇతర పంటలు నష్టపోయిన రైతులకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సునీల్ యువసేన నాయకులు బద్దం.అశోక్, మౌలానా, గంగాధర్, వెంకట్ మరియు గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



మెండోరాలో ధాన్యం పరిశీలిస్తున్న నాయకులు

జాతీయస్థాయి కరాటే పోటీల్లో బంగారు పథకాలు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఆంధ్రరాష్ట్రంలోని విశాఖపట్నంలో గతనెల 29,30 తేదీలలో జాతీయస్థాయి కరాటే పోటీలు జరిగాయి. ఇందులో ఏర్గట్లకు చెందిన విద్యార్థినులు లతిక 18 సంవత్సరాల విభాగంలో, అస్నియా భాను 16 సంవత్సరాల విభాగంలో, జాగతి 14 సంవత్సరాల విభాగంలో పోటీపడి బంగారు పథకాలు సాధించినట్లు జగిత్యాల జిల్లా చీఫ్ ఇన్స్ట్రక్టర్ పసునూరి అవినాష్ తెలిపారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుండి సుమారు 800 మంది వరకు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు. గెలుపొందిన విద్యార్థినులకు జపాన్ కరాటే షోటో ఫెడరేషన్ సంస్థ తెలంగాణ వ్యవస్థాపకులు సెన్సాయి ఎం.ఎస్.పాషా చేతుల మీదుగా మెడల్స్, ప్రశంస పత్రాలు అందుకున్నట్లు ఆయన తెలిపారు. విద్యార్థినులనున గ్రామస్తులు అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం భవన నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేష్ బిగాల కంఠేశ్వర్ బైపాస్ రోడ్డులో 50లక్షల రూపాయలతో నిర్మిస్తున్న మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం భవనం నిర్మాణానికి భూమి పూజ చేసి పనులని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ బిగాల మాట్లాడుతూ.. నిజామాబాద్ నగరం ప్రతి కులానికి,ప్రతి మతానికి సామాజిక కార్యక్రమలు నిర్వహించుకోవడానికి కమ్యూనిటీ హాళ్లను నిర్మిస్తున్నామన్నారు. మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు విన్నపం మేరకు 50 లక్షల రూపాలను మంజూరు చేసి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్ ,నుడ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి , టీఎన్జీవోఎస్ జిల్లా అధ్యక్షులు అలుక కిషన్,దండు శేఖర్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు నీలగిరి రాజు మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.పోటో



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉద్యగులు

పట్టా పాస్ బుక్ ఇప్పించండి

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

పాస్ పుస్తకం రాక అన్న తమ్ముళ్ల మధ్య గొడవలు అవుతున్నాయని పట్టా పాస్ బుక్ ఇప్పించాలని కులాస్ పూర్ గ్రామానికి చెందిన ఆకు తోట చిన్నన్న అనే రైతు కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ.. తహసీల్దార్ ఆఫీస్ చుట్టూ, కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్న కొత్త పాస్ పుస్తకం రాక రైతు బంధు రావడం లేదన్నారు. కొత్త పాస్ పుస్తకం లేక పోవడంతో వడ్లు అమ్మడం ఇబ్బందిగా మారుతుందని, పంట అమ్మాలంటే పాస్ పుస్తకం అడుగుతున్నారన్నారు. ఈనెల 15 న దుబాయి వెళ్లనున్నానని పాస్ పుస్తకం ఇప్పించాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ వెంటనే ఆర్ డి ఓ, ఎం ఆర్ ఓ తో మాట్లాడి కొత్త పాస్ పుస్తకం వచ్చేలా చూడాలని అధికారులకు ఆదేశించారు.